teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 259 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 24 జనవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## వాతావరణ మార్పుల పరిష్కరించడానికి సూర్యగఢ్ యోజనే సాధనం



02



## కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గ విభేదాలు

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి క్యాంప్ ఆఫీసుపై దాడి**

**కాంగ్రెస్‌లో జరుగుతోన్న పరిణామాలపై టీపీసీసీ ఆగ్రహం వ్యక్తం**



హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): పఠాన్ చెరు కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి క్యాంప్ ఆఫీసుపై నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అనుచరులు దాడి చేయడం ఇరు వర్గాల మధ్య అగ్గి రాజేసింది. నేతల మధ్య వర్గ పోరు ప్రభుత్వానికి

మిగతా 2 లో

## కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు

**పార్టీకి బాండ్ల రూపంలో బ్లాక్ మనీ వస్తుంది అంటూ ఆరోపనలు**



తెలంగాణ బ్యూరో, జనవరి 23 (తీన్మార్ న్యూస్): ప్రజాశాంతి పార్టీ జాతీయ అధ్యక్షుడు కేఏ పాల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డి పై, మంత్రుల పై సంచలన ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా ఆయన తన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మేఘా కృష్ణారెడ్డి

మిగతా 2 లో




# ప్రైవేటు బడుల్లో.. ఉచిత విద్యకు సర్కార్ కసరత్తు

**వచ్చే ఏడాది నుంచే విద్యాహక్కు చట్టం అమలు**




- విధివిధానాలు తయారు చేస్తున్న విద్యాశాఖ
- తొలుత ఫస్ట్ క్లాసు నుంచే అమలుకు యోచన
- వరుసగా పదేండ్లు అన్ని తరగతుల్లో
- ఇంప్లిమెంట్ చేసేలా నిర్ణయం

రాష్ట్రంలోని ప్రైవేటు బడుల్లో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లను కేటాయించేందుకు సర్కారు కసరత్తు చేస్తున్నది. వచ్చే విద్యాసంవత్సరం నుంచే దీనిని అమలు చేయాలని నిర్ణయించింది. ఇదే విషయాన్ని ఇటీవల హైకోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో దీనిని ఎలా అమలు చేయాలనే దానిపై అధికారులు చర్చలు జరుపుతున్నారు.

తెలంగాణ బ్యూరో, జనవరి 23 (తీన్మార్ న్యూస్): దేశంలో 2009లో తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టంలోని సెక్షన్12 (1)సీ ప్రకారం ప్రీ ప్రైమరీ, ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఇవ్వాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా తెలంగాణతో పాటు మరో ఆరు రాష్ట్రాలు మాత్రమే దీనిని అమలు చేయడం లేదు. మిగిలిన రాష్ట్రాలు కొంతమేర అమలు

మిగతా 2 లో





02

## టైటిల్ క్లియరెన్స్ రిపోర్ట్‌ల విషయంలో బ్యాంకులు జాగ్రత్త

**టైటిల్ సెర్చ్ రిపోర్ట్‌ల ప్రాముఖ్యతను నొక్కి చెప్పిన సుప్రీంకోర్టు**



02

## రికార్డు సృష్టించబోతున్న కరీంనగర్

**24గంటలు మంచినీరు అందించే చారిత్రక పథకంకు శ్రీకారం**



02

## బీఆర్ఎస్ గత ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు

**ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



## బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టులో మారోమారు ఎదురు దెబ్బ

**కోకాపేట భూములు కేటాయింపుపై కోర్టులో విచారణ**

**పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు సూచన**

.. వివరాలు 2లో

SKILLS UNIVERSITY
YOUNG INDIA TELANGANA

## స్కిల్ యూనివర్సిటీలో అందుబాటులోకి మరో నాలుగు కోర్సులు

.. వివరాలు 2లో

## బీసీ రిజర్వేషన్ల పెంపు ఇంకెంత కాలం..?

**ప్రశ్నించిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత**

**ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ**



హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు ఇంకెంత కాలం? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖలో మీ వైఖరితో బీసీలకు తీరని అన్యాయం జరగుతోంది. రిజర్వేషన్ల పెంపును విస్మరిస్తే ఊరుకోబోం. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాల్సిందేనని' సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బహిరంగంగా రాసిన లేఖలో పేర్కొన్నారు. కామారెడ్డి

మిగతా 2 లో

## పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరు మార్పు

**ఈ మేరకు క్యాబినెట్ నిర్ణయం**

తెలంగాణ బ్యూరో, జనవరి 23 (తీన్మార్ న్యూస్): పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరు మార్చాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా పథకానికి కేంద్ర మాజీ




మిగతా 2 లో

## 13 అంశాలకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం

**చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చ**

**సిటీలో నాలాల డీ సీల్టింగ్ పనులకు కమిటీ పచ్చ జెండా**




.. వివరాలు 2లో



## రాష్ట్ర వ్యాప్తంగా 13,861 గ్రామాల్లో గ్రామ సభలు పూర్తి

తెలంగాణ బ్యూరో, జనవరి 23 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకు 13,861 గ్రామాలు, వార్డులలో గ్రామ సభలు (85.96 శాతం) పూర్తయ్యాయని ప్రభుత్వం ప్రకటించింది. గ్రామ సభలు ప్రారంభమైన నాటి నుంచి గురువారం ఒక రోజు 3,986 గ్రామ సభలు విజయవంతంగా

మిగతా 2 లో

## గ్రామీణాభివృద్ధికి తెలంగాణ సర్కార్ పెద్ద పీఠ

**రాష్ట్ర మంత్రి మంత్రి సీతక్కవెల్లడి**



హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): గ్రామీణాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుందని మంత్రి సీతక్క అన్నారు. తాజాగా గ్రామీణాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు ప్రజా భవన్‌లో కలిసి పూల మొక్క అందచేసి మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో

# ప్రైవేటు బడుల్లో.. ఉచిత విద్యకు సర్కార్ కసరత్తు

మొదటి పేజీ తరువాయి

చేస్తున్నాయి. అయితే, చట్టం అమల్లోకి వచ్చి ఏండ్లు గడుస్తున్నా అమలు చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం ఒత్తిడి తీసుకొస్తోంది. దీనికితోడు ఉన్నత న్యాయస్థానాలూ ఈ చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలిచ్చాయి. దీంతో వచ్చే ఏడాది నుంచి విద్యా హక్కు చట్టం అమలు చేయనున్నట్లు రాష్ట్ర సర్కార్ హైకోర్టుకు తెలిపింది. ఈ క్రమంలో రాష్ట్రవాప్తంగా ఉన్న దాదాపు 11,500 ప్రైవేటు స్కూళ్లల్లో 25 శాతం సీట్లను పేదలకు కేటాయించేందుకు చర్యలు ప్రారంభించింది. కాగా, విద్యాహక్కు చట్టం అమలు కమిటీలోని కొన్ని అంశాలను సవరణ చేయాలని ఇటీవల స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. దీంతో త్వరలోనే విద్యాహక్కు చట్టం అమలు కమిటీ సమావేశం కానున్నది.



**ప్రతిపాదనలు రెడీ**

రాష్ట్రంలో 25 శాతం సీట్ల అమలుపై రెండు, మూడు ప్రతిపాదనలను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. అన్ని ప్రైవేటు బడుల్లో 25 శాతం ఉచిత సీట్ల విధానం అమలు చేస్తే సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనికి తోడు సర్కారుపైనా భారీగా భారం పడే అవకాశం ఉంది. అయితే, కర్నాటకలో అమల్లో ఉన్నట్టు విద్యార్థి చదివే చోటకు దగ్గరలో సర్కారు బడి లేకుంటే దీనిని అమలు చేయాలనే ప్రతిపాదన ఉంది. దీనివల్ల చాలా వరకు సర్కారుపై ఎఫెక్ట్ పడబోదనే భావన ఉంది. ఈ లెక్కన తొలి ఏడాది సుమారు 10 వేల నుంచి 15 వేల మందికే ఫీజు చెల్లించే అవకాశం ఉంటుంది. అయితే, ఫీజులను ఎలా నిర్ణయించాలనే దానిపై అధికారులు చర్చిస్తున్నారు. ప్రస్తుతం స్కూళ్లల్లో వసూలు చేస్తున్న ఫీజు గానీ, ప్రభుత్వం ఒక స్టూడెంట్‌పై ఖర్చు చేసే యావరేజీలో ఏది తక్కువగా ఉంటే దానిని అమలు ఫీజుగా నిర్ణయించాలని ఉమ్మడి రాష్ట్రంలో తీసుకొచ్చిన జీవోలో ఉంది. దీంతో దీనిని అమలు చేయలా ఇందులో ఏమైనా మార్పులు చేయాలా అనే దానిపై అధికారులు ఆలోచనలు చేస్తున్నారు. వీటిపై త్వరలో సర్కారు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**ఫస్ట్ క్లాసు నుంచే అమలు**

వచ్చే విద్యా సంవత్సరం ఒకటో తరగతి నుంచి పేద విద్యార్థులకు ఉచిత సీట్లను ప్రభుత్వం కేటాయించనుంది. రెండో ఏడాది రెండో తరగతి దాకా, మూడో ఏటా థర్డ్ క్లాసు దాకా ఇలా పదేండ్లలో అన్ని క్లాసులకు ఇది వర్తింపజేయనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రైవేటు బడుల్లో ఏటా సుమారు 4 లక్షల మంది వరకు ఒకటో తరగతిలో చేరుతున్నారు. వీరిలో 25 శాతం అంటే సుమారు లక్ష మందికి ఉచిత విద్య అందనున్నది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సహా అన్ని రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. ఎంపిక విధానంలోనూ పేరెంట్స్ ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోనున్నారు. 2010లో రూపొందించిన ఇన్ కమ్ కాకుండా కొత్తగా దీనిని మార్చనున్నారు.

## బీఆర్ఎస్ గత ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు

హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వంపై కావాలనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో ఎవరికీ ఆందోళన అవసరం లేదని, చివరి లబ్ధిదారుడి వరకు రేషన్ కార్డులు అందజేయాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 40,000 రేషన్ కార్డులు మాత్రమే జారీ చేసిందని, అయితే తమ ప్రభుత్వం లక్షల్లో కార్డులు ఇవ్వబోతుందన్నారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న లిస్టు తుది జాబితా కాదని, అది కేవలం వెరిఫికేషన్ కోసం మాత్రమేనని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తుల పరిశీలన ఐదేళ్ల పాటు జరుగుతుందని వివరించారు. కృష్ణా జలాల విషయంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని, మన హక్కుల్ని ఇతరులకు అప్పగించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రజలకు వాస్తవాలు వివరించాలని ప్రజా ప్రతినిధులకు సూచించారు. ఈనెల 26 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని, అర్హులందరికీ అందే వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి ప్రకటించారు. సామాజిక ఆర్థిక సర్వే, ప్రజా పాలన దరఖాస్తులు, కులగణన, అలాగే గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.

## 13 అంశాలకు జీహెచ్ఎంసీ స్టాడింగ్ కమిటీ ఆమోదం

హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 13 అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలకు జీహెచ్ఎంసీ స్టాడింగ్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ అధ్యక్షతన గురువారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హైదరాబాద్□లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై సు-దీర్ఘంగా చర్చించిన అనంతరం ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 13 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. సిటీలో ఉన్న నాళాల డీ సిల్టింగ్ పనులకు స్టాండింగ్ కమిటీ పచ్చ జెండా ఊపింది. అలాగే జూ పార్క్-ఆరాంఘర్ ఫ్లై ఓవర్□కు డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎక్స్ ప్రెస్ వేగా నామకరణం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కూడా ఆమోదం లభించింది. కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాల్లో సీఎస్ఆర్ పద్ధతిలో గ్రీనరీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు సీఆర్ఎంపీ ఫేజ్1 కింద చేపట్టిన పనులకు కొనసాగింపుగా ఫేజ్- 2 కింద చేపట్టాల్సిన 744 కిలోమీటర్ల రోడ్డు నిర్వహణ ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చేందుకు స్టాండింగ్ కమిటీ ఒకే చెప్పింది. హెచ్-సీటీ ప్రాజెక్టు కింద సిటీలో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ నిర్మాణాలకు రూ.7,032 కోట్ల వ్యయంతో చేపట్టే పనులకు ప్రభుత్వ ఆమోదం కోసం సిఫారసులు పంపాలని నిర్ణయించింది. అలాగే నారాయణగూడలో ఓల్డ్ మున్సిపల్ మార్కెట్ స్థలంలో నిర్మించిన మోడల్ మార్కెట్ భవన నిర్మాణంలో చేసిన మార్పులకు కమిటీ ఆమోదం తెలిపింది. వీటితో పాటుగా సిటీలో పలు రోడ్ల విస్తరణకు స్టాండింగ్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**జనవరి 30న కౌన్సిల్ మీటింగ్**

ఈ నెల 30న జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్ జరగనుంది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరగనున్న కౌన్సిల్ మీటింగ్‌లో గ్రేటర్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొనున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ జీహెచ్ఎంసీ బడ్జెట్‌ను మేయర్ విజయలక్ష్మీ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టనున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.8,440 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలను ఇప్పటికే జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదించిన విషయం తెలిసిందే. అలాగే ప్రజా సమస్యలపై కౌన్సిల్‌లో చర్చ జరగనుంది. దీంతో పాటు మేయర్, డిప్యూటీ మేయర్‌లపై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని యోచిస్తోన్న నేపథ్యంలో ఈ కౌన్సిల్ మీటింగ్ హాట్ హాట్ సాగుతోందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## వాతావరణ మార్పుల పరిష్కరించడానికి సూర్యగఢ్ యోజనే సాధనం



న్యూ ఢిల్లీ, జనవరి 23 (తీన్మార్ న్యూస్): వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రధాన మంత్రి సూర్యగఢ్ యోజన ఒక సాధనంగా ప్రధాని నరేంద్ర మోదీ గురువారం పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్ సౌరశక్తి ద్వారా విద్యుత్ ఉత్పత్తికి దోహదపడుతుందని, విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా పోతుందన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పరాక్రమ్ దివస్‌గా స్మరించుకునే సందర్భంగా గురువారం న్యూఢిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో విద్యార్థులతో సంభాషించిన సందర్భంగా ప్రధాన మంత్రి పిఎం సూర్యగఢ్ యోజన యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు.

ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఇతర నేతలు కూడా నివాళులర్పించారు. ఇంటరాక్షన్ సందర్భంగా, కేంద్రం అందించిన వెయ్యి 200 ఎలక్ట్రిక్ బస్సులు ఢిల్లీలో నడుస్తున్నాయని మోదీ ఉద్ఘాటించారు.

## టైటిల్ క్లియరెన్స్ రిపోర్ట్‌ల విషయంలో బ్యాంకులు జాగ్రత్త




న్యూ ఢిల్లీ, జనవరి 23 (తీన్మార్ న్యూస్): చట్టపరమైన వివాదాలను నివారించడంలో, ఆస్తి లావాదేవీలు సజావుగా జరిగేలా చూడడంలో అసలైన యజమానులు ఎవరో తెలిపే సమగ్ర టైటిల్ సెర్చ్ రిపోర్ట్‌ల ప్రాముఖ్యతను సుప్రీంకోర్టు ఇటీవల నొక్కి చెప్పింది. బ్యాంకులు రుణం మంజూరు చేసే ముందు టైటిల్ సెర్చ్ రిపోర్టులను సిద్ధం చేయడానికి ప్రామాణికమైన, ఆచరణాత్మక ఫ్రేమ్‌వర్క్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇతర వాటాదారులు అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని కోర్టు నొక్కి చెప్పింది. తప్పుడు టైటిల్ సెర్చ్ రిపోర్టు ఆధారంగా రుణాన్ని మంజూరు చేసిన బ్యాంకు అధికారిపై ఎలాంటి చర్యలు ఉండాలన్నది కూడా ఫ్రేమ్‌వర్క్‌లో చేర్చాలని కోర్టు పేర్కొంది.

**బ్యాంకులు జాగ్రత్తగా ఉండాలి.**

అస్పష్ట టైటిల్ క్లియరెన్స్ రిపోర్ట్‌ల విషయంలో బ్యాంకులు చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని మేము భావిస్తున్నాం. ఇది ప్రజా ధన రక్షణకు, పెద్ద ప్రజా ప్రయోజనానికి సంబంధించినది. అందువల్ల, రుణాలను మంజూరు చేసే ముందు టైటిల్ సెర్చ్ రిపోర్టును సిద్ధం చేయడానికి, ఆమోదించే అధికారి బాధ్యతను (క్రిమినల్ చర్యతో సహా) నిర్ణయించే ఉద్దేశంతో ఒక ప్రామాణిక, ఆచరణాత్మక విధానాన్ని అభివృద్ధి చేయడంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్, ఇతర వాటాదారులు సహకరించడం చాలా అవసరం. అంతే కాకుండా టైటిల్ సెర్చ్ రిపోర్ట్‌లకు సంబంధించిన ఫీజులు, ఖర్చుల కోసం ప్రామాణిక మార్గదర్శకాలు ఉండాలి అని కోర్టు పేర్కొంది. వివాదాస్పద తనఖా ఆస్తిపై ఆధారపడి బ్యాంకు మంజూరు చేసిన రుణం, టైటిల్ వివాదాలు ఉన్నట్లు గుర్తించిన సందర్భంలో, అటువంటి ప్రామాణిక ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం నొక్కి చెప్పింది. యాజమాన్యాన్ని ధ్రువీకరించడం, ప్రతికూల క్లెయిమ్‌లు లేవని నిర్ధారించడం, ఆస్తికి సంబంధించిన స్పష్టమైన చట్టపరమైన స్థితిని నిర్ధారించడం ద్వారా బలమైన టైటిల్ సెర్చ్ మోసపూరిత లావాదేవీలను నిరోధించవచ్చని కోర్టు అభిప్రాయపడింది.


## రికార్డు సృష్టించబోతున్న కరీంనగర్



కరీంనగర్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా ఓ పట్టణంలో 24గంటల పాటు మంచినీటిని అందించే చారిత్రాక పథకం ప్రారంభోత్సవానికి ఈరోజు శ్రీకారం చుట్టనున్నారు. కరీంనగర్ లో 2,660 ఇండ్లకు ఇకపై ప్రతిరోజు 24 గంటలపాటు మంచి నీళ్ల సరఫరా పథకాన్ని నేడు హర్యానా మాజీ సీఎం, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో రోజంతా మంచినీరందించే నగరంగా రికార్డు కరీంనగర్ రికార్డు సృష్టించబోతున్నట్లుగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సునీల్ రావు వెల్లడించారు. ఇప్పటి వరకు దేశంలోని ఒకటి, రెండు పట్టణాల్లో మాత్రమే ఇటీవల 24 గంటలపాటు తాగునీటి సరఫరా ఇచ్చే కార్యక్రమాలు ప్రారంభయ్యాయని, వాటిలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చండీగఢ్ మణిమజ్రా పట్టణంలో గత ఏడాది ఆగస్టులో 24/7 గంటలపాటు తాగునీటిని సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లుగా తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని ఏ పట్టణంలో కూడా 24 గంటలపాటు నిరంతరాయంగా మంచి నీటిని సరఫరా చేస్తున్న దాఖలాల్లేవని కరీంనగర్ ఆ రికార్డును సాధించబోతోందని పేర్కొన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ లో పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు డివిజన్లో 4,055 ఇళ్లకు 24 గంటల పాటు తాగునీటిని అందించాలనే ఆశయం నెరవేరడానికి నేడు అంకురార్పణ జరగబోతోందన్నారు. కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, బండి సంజయ్ లు 2,660 ఇళ్లకు 24 గంటల పాటు తాగునీటిని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా ఆ తరువాత కొద్దిరోజుల్లోనే హౌజింగ్ బోర్డులో పరిధిలోని 4,055 ఇండ్లకు నిరంతరాయంగా మంచి నీళ్లు సరఫరా కానున్నాయని వెల్లడించారు. దీంతోపాటు కేంద్ర మంత్రులు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను కూడా మనోహర్ లాల్ ఖట్టర్ ప్రారంభిస్తారని, వాటిలో అంబేద్కర్ స్టేడియంలో రూ.22 కోట్లతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్, అనుబంధ పనులను, రూ.8.2 కోట్లతో మల్టీపర్పస్ స్కూల్ లో చేపట్టిన పార్క్ పనులను, రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మించిన రాజీవ్ పార్క్ అభివృద్ధి పనులను, నగరంలోని అంబోతు వీర్యం కేంద్రం వద్ద పద్మా నగర్ లో రూ.14 కోట్లతో నిర్మించిన 'ఇంటిగ్రేటెడ్ మార్కెట్' భవనాన్ని, రూ.10.2 కోట్లతో నిర్మించిన స్మార్ట్ క్లాస్ రూమ్ ను, సుభాష్ నగర్ పాఠశాలలో రూ.10.2 కోట్లతో నిర్మించిన స్మార్ట్ డిజిటల్ క్లాస్ ను ప్రారంభించనున్నారు. ఆయా కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు కేంద్ర మంతులతో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా హాజరుకానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## గ్రామీణాభివృద్ధికి తెలంగాణ సర్కార్ పెద్ద పీట

మొదటి పేజీ తరువాయి



సీతక్క మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి మా ప్రభుత్వం అధిక ప్రధాన్యతనిస్తోందని సీతక్క అన్నారు. ఎన్నడు లేని విధంగా నిధులు మంజూరు చేసిన పనులు చేయిస్తున్నామని వెల్లడించారు. మొదటి విడతలో రూ. 2682 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తాజాగా మరో రూ. 2773 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఇవే కాకుండా ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.197 కోట్లు సాంక్షన్ చేసినట్లు స్పష్టం చేశారు. గతంలో పీఎంజీఎస్‌వై కోసం రూ. 110 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. పల్లెల్లో రోడ్లు, డ్రేనేజీలు, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రాబోయే కాలంలో మరిన్ని నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా క్షేత్ర స్థాయి పంచాయతీ రాజ్ రూరల్ ఇంజనీరింగ్ అధికారులకు వాహన సదుపాయం తెలంగాణ ప్రభుత్వం కల్పించిందన్నారు. పనుల పర్యవేక్షణ కోసం ఈఈలు, డిప్యూటీ ఈఈలు, ఎస్ఈ లకు వెహికిల్స్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 237 మంది ఇంజనీరింగ్ అధికారులకు రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఒక్కో వాహన అద్దె చెల్లింపున కోసం నెలకు రూ.33 వేలు విడుదల చేసినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వంలో అధికారులకు వెహికిల్స్ అలవెన్స్ లేదని, మారు మూల ప్రాంతాల్లో జరిగే పనుల పర్యవేక్షణకు వెల్లేందుకు ఇంజనీర్లు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. వాళ్ల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం, వాహన సదుపాయం కల్పించిందన్నారు.

## కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గ విభేదాలు

మొదటి పేజీ తరువాయి

ఇబ్బందిగా మారడంతో పఠాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్‌లో జరుగుతోన్న పరిణామాలపై టీపీసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో పటాన్ చెరు కాంగ్రెస్‌లో చోటు చేసుకున్న ఘటనపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆదేశాల మేరకు విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శి వినోద్ రెడ్డిల కమిటీ సభ్యులుగా నియమించిన టీపీసీసీ పఠాన్ చెరు ఘటనపై విచారణ జరిపి పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కాగా పఠాన్ చెరు కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు తారాస్థాయికు చేరుకున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వెళ్లిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మధ్య వర్గ పోరు మరింత ముదిరింది. ఎమ్మెల్యే గూడెం అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నేతలపైన దాడులు చేయిస్తున్నారని గురువారం కాట శ్రీనివాస్ గౌడ్ అనుచరులు నియోజకవర్గంలో ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీకి బాండ్ల రూపంలో లెక్కలేని బ్లాక్ మనీ ఇస్తున్నాడని ఆరోపించారు. అలాగే రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేఘా కృష్ణారెడ్డిని తిట్టాడని ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదే మేఘా కృష్ణారెడ్డికి ప్రాజెక్టులు ఎలా ఇస్తున్నారని పాల్ ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలోనే రోజు మేఘా కంపెనీ పై ఆరోపణలు చేసిన ప్రభుత్వం రూ.15 వేల కోట్ల ప్రాజెక్టులు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడానికి దాదాపు రూ.4000 కోట్లు ఖర్చు చేసిందని. ఇంత మొత్తంలో డబ్బులు వారికి ఎక్కడి నుంచి వచ్చాయో త్వరలోనే అన్ని ఆధారాలతో మీ ముందు పెడతానంటూ కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టులో మారోమారు ఎదురు దెబ్బ




హైదరాబాద్, జనవరి 23 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టులో మారోమారు ఎదురు దెబ్బ తగిలింది. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి కోకాపేట భూములు కేటాయింపుపై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి కోకాపేట ప్రాంతంలో 11 ఎకరాల భూమిని కేటాయించారు. అధిక ధరలు కలిగిన భూమిని తక్కువ ధరలకు పార్టీ కార్యాలయంకు కేటాయించారని న్యాయవాది వెంకట్రామిరెడ్డి ముఖ్యమంత్రి కెసిఆర్ చీఫ్ సెక్రటరీ లో పై హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. రూ.1100 కోట్ల విలువైన భూమిని రూ.37 కోట్లకు కేటాయించారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## స్కిల్ యూనివర్సిటీలో అందుబాటులోకి మరో నాలుగు కోర్సులు

తెలంగాణ బ్యూరో, జనవరి 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్థాపించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో మరో నాలుగు కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఎండోస్కోపీ టెక్నిషియన్, సప్లయ్ చైన్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రాం, మెడికల్ కోడింగ్ స్పెషలిస్ట్, బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్సూరెన్స్ కోర్సులు ప్రారంభించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వెబ్‌సైట్ https://yisu.inలో దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ సూచించారు.

## బీసీ రిజర్వేషన్ల పెంపు ఇంకెంత కాలం..?

మొదటి పేజీ తరువాయి

డిక్లరేషన్‌లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం. "కుల గణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ల పెంపు అని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో స్పష్టంగా పేర్కొని ఉంది. 6 నెలలు గడిచాయి ఏడాది గడిచింది అయినా కూడా రిజర్వేషన్ల పెంపునకు అతీగతీ లేదు. అశాస్త్రీయంగా బీసీ గణన నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన చేయడమే మీ ఆలోచనగా కనిపిస్తోంది అని అన్నారు.

## పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పేరు మార్పు

మొదటి పేజీ తరువాయి

మంత్రి జైపాల్ రెడ్డి పేరు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రివర్గ నిర్ణయానికి అనుగుణంగా గురువారం నీటిపారుదల శాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్. జైపాల్ రెడ్డి పీఆర్ఎల్ఐ పథకంగా నామకరణం చేశారు. అంతేకాదు సింగూరు ప్రాజెక్టుకు మంత్రి దామోదర రాజనర్సింహా తండ్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాజనర్సింహ పేరు పెట్టాలని కేబినెట్‌లో నిర్ణయించిన సంగతి తెలిసిందే. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు రెండో ప్యాకేజీ రివైజ్డ్ ఎస్టిమేట్ రూ.1,784 కోట్లకు ఆమోదం తెలిపారు. ఏదల రిజర్వాయర్ నుంచి డిండి లిఫ్ట్ స్కీంకు లింక్ చేసే పనులకు రూ.1,800 కోట్లతో ఆమోదముద్ర వేశారు.

## రాష్ట్ర వ్యాప్తంగా 13,861 గ్రామాల్లో "గ్రామ" సభలు పూర్తి




మొదటి పేజీ తరువాయి

పూర్తయ్యాయి. ఈ గ్రామ, వార్డు సభలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ప్రభుత్వం ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించి తమ దరఖాస్తులు అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడో రోజున గ్రామ సభలు 3130, వార్డు సభలు 856 నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలలో పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# డాలర్ డ్రీమ్సేనా.....

అమెరికా 47వ అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లో అడుగుపెట్టిన డొనాల్డ్ ట్రంప్ తొలి రోజే పలు సంచలనాలకు తెరతీశారు. ఎన్నికల ప్ర చార సమయంలో హామీ ఇచ్చినట్లుగా అక్రమ వలసలను అరికట్టడంతో పాటుగా పదుల సంఖ్యలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో అత్యం త ప్రధానమైనది 'జన్మతః పౌరసత్వం'పై వేటు. దాదాపు వందేళ్లుగా అనుసరిస్తూ వస్తున్న ఈ విధానానికి ట్రంప్ స్వస్తి పలికారు.అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతల చేపట్టిన వెంటనే అక్రమ వలసలపై డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన లక్షల మంది విదేశీయులను ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికాకు అక్రమంగా వచ్చినవారిని వెనక్కి పంపడం ఖాయమని ట్రంప్ చేసిన ప్రకటన వణికిస్తోంది. తాత్కాలిక వీసాలపై వచ్చినవారిదీ ఇదే పరిస్థితి. సరైన పత్రాల్లేకుండా అమెరికాలో నివసిస్తున్న విదేశీ పౌరుల సంఖ్య దాదాపు 1.40 కోట్లు ఉంటుందని అంచనా. వీరిలో సుమారు 7.25 లక్షల మంది భారతీయులే. మెక్సికో, ఎల్ సాల్వెడార్ పౌరుల తర్వాతి స్థానం మనోళ్లదే.ఈ నిర్ణయం ప్ర భావం అమెరికాలో ఉంటున్న లక్షలాదిమంది భారతీయులపై తీవ్ర ప్రభా వం చూపించనుంది. అక్రమంగా అమెరికాలో ఉంటున్న వారితో పాటుగా విద్యార్థులు, టూరిస్టు, హెచ్1బీ లాంటి తాత్కాలిక వర్క్ వీసాలపై దే శంలో ఉంటున్న వారికి జన్మించే పిల్లలకు ఇకపై అమెరికా పౌరసత్వం ల భించదు. ఈ తరహా పౌరసత్వాన్ని ఏ దేశం కూడా ఇవ్వడం లేదని, తాముకూడా ఇచ్చేది లేదని ట్రంప్ స్పష్టం చేశారుతల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా అమెరికా పౌరసత్వం, శాశ్వత నివాసం, గ్రీన్‌కార్డు, అమెరికా మిలిటరీ సభ్యత్వం ఇలా ఏదైనా ఒక గుర్తింపు ఉంటేనే వారి పిల్లలకు పుట్టుకతో దే శ పౌరసత్వం ఇస్తామని తేల్చి చెప్పారు. అయితే అమెరికా మాత్రమే ఇలాంటి పౌరసత్వం ఇస్తున్నట్లు ట్రంప్ చెప్పిన దాంట్లో నిజం లేదు. ప్రపంచవ్యాప్తంగా 30కి పైగా దేశాలు ఇలా పౌరసత్వాన్ని ఇస్తున్నాయి. అమె రికాలో అంతర్యుద్ధం ముగిసిన మూడేళ్ల తర్వాత 1868లో ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణతో ఈ హక్కు లభించిందశరణార్థులుగా వచ్చిన నల్లజాతివారిని బానిసలుగా చూసే దుష్ట సంప్రదాయానికి ముగింపు పలకడానికి ఇది వీలు కల్పించింది. ఇప్పుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో ఇది రద్దు కానుంది. ఈ ఉత్తర్వు 30 రోజుల తర్వాతినుంచి అమలులోకి రానుంది. అయితే చట్టబద్ధంగా ఇది అమలు కావడం అసాధ్యమని నిపుణులు అంటున్నారు. ట్రంప్ ఉత్తర్వులను న్యాయస్థానాలు రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించే అవకాశం ఉందిఅమెరికా సుప్రీంకోర్టు సైతం జన్మతః పౌరసత్వాన్ని సమర్థించింది. ఆ అవకాశాలు లేకపోలేదని ట్రంప్ కూడా చెప్పడం గమనార్హం. అంతేకాదు ఉత్తర్వు అమలుకు రాజ్యాంగ సవరణ అవసరం. అమెరికా పార్లమెంటులోని ఉభయ సభలు మూడింట రెండు వంతుల మెజారిటీతో సవరణను ఆమోదించాలి. ఇది సుదీర్ఘ ప్రక్రియ. మరోవైపు ట్రంప్ నిర్ణయాన్ని న్యాయస్థానాల్లో సవాలు చేసేందుకు హక్కుల సంఘాలు సిద్ధమవుతున్నాయి.ఇదంతా అటుంచితే దీని ప్రభావం భారతీయులపై తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. 2024 నాటికి అమెరికాలో దాదాపు 54లక్షల మంది భారతీయులు ఉన్నారు. దేశ జనాభాలో 1.47 శాతానికి ఇది సమానం. వీరిలో 34 శాతం మంది అమెరికాలో పుట్టిన వారు కాగా, మిగతా వా రంతా వలస వచ్చిన వారే. అందులో ఎక్కువమంది హెచ్1బీ వీసా కింద వచ్చిన వారే.వాస్తవానికి అమెరికా వెళ్లిన భారతీయుల్లో చాలామంది తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం పొందేందుకు 'బర్త్ టూరిజం'ను అంటే పిల్లలకు జన్మనివ్వడం కోసమే అమెరికాకు వెళ్లడాన్ని ఒక మార్గంగా ఎంచుకొంటున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. మెక్సికో, చైనాలాంటి దేశాల వారూ ఇదే పద్ధతి అనురిస్తున్నారు. అందులో కొంత వాస్తవం లేకపోలేదు. ఎందుకంటే గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా అది దక్కాలంటే ఏళ్ల తరబడి వేచిచూడాలి.అందుకే తమ పిల్లలకు, తద్వారా తమ కూ అమెరికా పౌరసత్వం దక్కేందుకు ఈ మార్గాన్ని ఎంచుకొంటున్నారు. ఇప్పటికే ఇలా అమెరికాలో పుట్టిన పిల్లలు వేల సంఖ్యలో ఉ న్నారు. వీరు కూడా అమెరికాలోనే ఉండాలంటే చదువుతో పాటుగా అన్ని విషయాల్లో ను ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది.అలాగని కుటుంబాలు వేరుపడడం కూడా సాధ్యం కాదు. స్వదేశానికి తిరిగి వెళ్లడం ఒక్కటే మార్గం. ట్రంప్ కోరుకొంటున్నది కూడా అదే. అయితే దేశంలోని అన్ని వ్యవస్థలపైనా దీని ప్రభావం పడుతుందనేది నిపుణులు హెచ్చరిస్తున్నారు.అక్రమ వలసలను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో ఎమర్జెన్సీ విధించి.. మరిన్ని బలగాలను మోహరిస్తామని ట్రంప్ ప్రకటించారు. చట్టవిరుద్ధంగా నివసిస్తున్న విదేశీ పౌరులను అందర్నీ గుర్తించి.. వారిని తిరిగి వారి వారి దేశాలకు పంపించేందుకు ట్రంప్ యంత్రాంగం చర్యలు మొదలుపెట్టింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం కూడా ట్రంప్ సర్కారుతో కలిసి పనిచేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని.. ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని.. తత్ఫలితంగా వాణిజ్య యుద్ధాన్ని నివారించేందుకు, ట్రంప్‌నకు సహకరించేందుకు ఇది ముందస్తు ఆలోచన అని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# కాలువలు శిథిలంలో పట్టించుకునేది ఎవరు ఆందోళనలో అన్నదాతలు

- ప్రశ్నార్థకంగా రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం లిఫ్ట్-2 ఏనుకుంట రిజర్వాయర్ సాగు కాలువలు
- పూడిపోయిన పంట కాలువ నీళ్లు అందక రైతుల ఆందోళన
- కాలువల్లో నిండిపోయిన సిల్టు కంప చెట్లు పిచ్చిమొక్కలు
- నిర్వహణ మరిచిన నీటిపారుదల శాఖ అధికారులు
- యాసంగి సాగుపై గ్రామాల రైతులు అయోమయంలో
- ఎండాకాలంలో పంటలు ఎండిపోకుండా సాగునీటి కష్టాలను తీర్చాలి





దేవరకద్ర ప్రతినిధి,జనవరి23(తీన్మార్ న్యూస్)
పంటలు సమృద్ధిగా పండటంలో సాగునీటి కాలువలు కీలక భూమిక పోషిస్తాయి. అలాంటి సాగునీటి కాలువల నిర్వహణను గత పదేళ్లుగా ప్రభుత్వాలు పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం పరిధిలోని భారీ నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం లిఫ్టు-2 ఏనుకుంట రిజర్వాయర్ పరిధిలోని సాగు నీటి కాలువల్లో పూడికలు తీయకపోవడంతో పంటలకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**నీరందక రైతుల తీవ్ర ఇబ్బందులు**

సాగు నీటి కాలువల నిర్వహణ అధ్వానంగా తయారైందని రైతులు కోరుతున్నారు.పూడికలు తీయకపోవడంతో కంప చెట్లు,పిచ్చి మొక్కలు, పూడిక,జమ్ము,ఇసుక దిబ్బలు సిల్టు విపరీతంగా పెరిగి కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని భారీ నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం లిఫ్టు-2 ఏనుకుంట రిజర్వాయర్ పరిధిలో వడ్డేవాట గ్రామం,వడ్డేవాట తాండ,తీర్మాలయావల్లి గ్రామం,అజ్జకొల్లు గ్రామం రిజర్వాయర్ పరిధిలో దాదాపు సుమారుగా 15 కిలోమీటర్లు కాలువ ఉండడంతో సాగునీరు పారేదేమో 4 కిలోమీటర్లు మాత్రమే శిస్తు బోర్లు బావులు కాలువలు సాగు కలిపి వేలు ఎకరాలు పొలాలకు నీరందక నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. తీర్మాలయాపల్లి,అజ్జకొల్లు రైతులకు సాగునీరు అందడం లేదని,గత ప్రభుత్వంలో కాలువలను నిర్లక్ష్యం చేయడంతో పంటలకు నీరందక తీవ్ర ఇబ్బందులు పడ్డామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాసిరకమైన పనులు కాలువ నిధులు దండుకున్నారు.గత ప్రభుత్వ హయాంలో సాగునీటి కాలువలను బాగు చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. నేతల నిర్లక్ష్యం ఫలితంగా పొలాలకు నీరందక నష్టపోతున్నామని రైతులు ఆవేదన. నాణ్యమైన పనులు చేపట్టకపోవడం,తూతూ మంత్రంగా పనులు చేసి మమ అనిపించడంతో కాలువలు పూడికతో నిండిపోయాయి. కాలువల్లో దట్టంగా కంప చెట్లు, జమ్ము,పూడిక పేరుకుపోయి సాగునీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది.సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్వహణ విషయంలో నీటిపారుదల శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు ఉన్నా యి.సాగునీటి కాలువల నిర్వహణను గాలికి వదిలేయడంతో రైతుల పొలాలు ప్రశ్నార్థకంగా బీడు భూములుగా మారాయి.సమయానికి ఈ ఏడాదైనా పూడిపోయిన కాలువను దేవరకద్ర స్థానిక ఎమ్మెల్యే,సంబంధిత అధికారులు చొరవ చూపి పూడికతీత చేపట్టి ఎండాకాలంలో పంటలు ఎండిపోకుండా రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.



# "తీన్మార్ న్యూస్ ఎఫెక్ట్"

# దుకాణాలపై తనిఖీలు

- ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- కండిషన్ పెడితే లైసెన్స్ కట్
- మదనాపురం మండలం ఎంఏవో గాయత్రి



దేవరకద్ర ప్రతినిధి,జనవరి23(తీన్మార్ న్యూస్)
ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి రైతులకు అధిక ధరలకు ఎరువులు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని మదనాపురం ఎంఏవో గాయత్రి హెచ్చరించారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం కేంద్రంలోని తీన్మార్ న్యూస్ కథనానికి స్పందించి పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీలు నిర్వహించిన వ్యవసాయ శాఖ అధికారులు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియాకు గుళికలకు కండిషన్ లేకుండా రైతులకు దుకాణదారులు విక్రయిం చాలని, ఎరువుల కొరత సృష్టిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయించాలని కోరారు.రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. ఎరువులు అధిక ధరలకు విక్రయించినా,కాలం చెల్లించిన మందులు అమ్మినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య



ఆత్మకూరు జనవరి 23 తీన్మార్ న్యూస్:- వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణం లోని బీసీ కాలనీలో గల లోకేష్ (నాని ) అనే 22 సంవత్సరముల యువకుడు కడుపునొప్పి భరించలేక ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడట్టు ఆత్మకూరు ఎస్సై నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు బీసీ కాలనీలో వాటర్ మేన్ నీళ్ల ఆటో నడుపుతున్న నాని అర్ధాంతరంగా చనిపోవడంతో బిసి కాలనీలో విషాద చాయలు ఆకుముకున్నాయి.

# సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట ..

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్

నిజాంసాగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనతో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ అన్నారు. గురువారం నిజాంసాగర్ మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామ పంచాయతీలో ప్రజా పాలన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చెరవేయడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకం అందించడం ప్రభుత్వ లక్ష్యం అని అయన అన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కుట్ర పూరిత మోసాలను ప్రజల నమ్మ వద్దన్నారు. కార్యక్రమంలో తాహసిల్దార్ బిక్షపతి, ఐకెపి ఎపిఎం రా%శీ%నారాయణ గౌడ్, ఈజీఎస్ ఏపీవో శివకుమార్ ,వ్యవసాయ శాఖ ఏఈఓ స్వర్ణలత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామసభలు

## ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు గ్రామసభలలో పాల్గొన్న అధికారులు




దేవరకద్ర ప్రతినిధి,జనవరి23(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని శంకరమ్మపేట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ సభను అధికారులు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అయినా స్పెషల్ ఆఫీసర్లు, రెవెన్యూ శాఖ ఆర్ ఐ,ఎంపీఓ, వివిధ శాఖ అధికారులు గ్రామసభలలో పాల్గొన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా,నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఈ నాలుగు స్కీములకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను గ్రామసభలు చదివి వినిపించారు. అదేవిధంగా చదివి వినిపించిన వాటిని ఆమోదించడం జరిగింది.లబ్ధిదారుల పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవలసిందిగా గ్రామసభలో అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అమృత్ 2.0 ద్వారా మంచినీటి సరఫరా

- 17 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ



ఆత్మకూర్ జనవరి 23 తీన్మార్ న్యూస్:- వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0 ద్వారా మంచి నీటి సరఫరా అభివృద్ధి పథకానికి గురువారం రోజు మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణమ్మ మాట్లాడుతూ అమృత్ 2.0 ద్వారా ప్రతి ఇంటింటికి మంచినీటి సరఫరా అందించడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని మున్సిపల్ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని వారు అన్నారు. ప్రభుత్వ పథకాలలో కేంద్ర ప్రభుత్వం వాటా తప్పనిసరిగా ఉంటుందని ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని ఈ సందర్భంగా వారు బుధవారం రోజు ఆత్మకూరు పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు డయాలసిస్ సెంటర్ ప్రారంభించారు. కానీ డయాలసిస్ సెంటర్ ఇంకా పూర్తి కాలేదు మంత్రివర్యులు కేవలం మంచాలకు మాత్రమే ఇనగ్రేషన్ చేశారని వారు మండిపడ్డారు.కాబట్టి ఇప్పటికైనా అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దామని వారు పిలుపునిచ్చారు.ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ వైస్ చైర్ పర్సన్ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు, రేషన్ కార్డ్

- దశలవారీగా అందరికీ అందజేస్తాం
- జాబితాలో పేర్లులేని వారికి మరోసారి దరఖాస్తుకు అవకాశం

మహబూబ్ నగర్: మహబూబ్నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కప్పెట గ్రామంలో జరుగుతున్న గ్రామ సభలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గోన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలతో మమేకం కావడానికి, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి, వాస్తవ పరిస్థితులను గుర్తించడానికి ఇలాంటి గ్రామసభలు ఉపయోగపడుతాయి. పార్టీలకు అతీతంగా పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. పథకాలకు లబ్దిదారుల ఎంపికలో రాజకీయాలకు తావులేదని అన్నారు.దశలవారీగా ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్లు, రేషన్ కార్డు ఇస్తాం. అర్హులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా12 వేలు అందజేస్తాం. పథకాలకు గతంలో దరఖాస్తు చేసుకోనివారికి, దరఖాస్తు చేసుకున్నా పేరు రానివారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి దరఖాస్తునూ మరోసారి పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకాలు అందజేస్తాం. మీ ఊరికి మళ్లీ వచ్చి ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలను నేనే ప్రారంభిస్తానని అన్నారు. గతంలో రాష్ట్రంలో లక్షల కుటుంబాలకు ఇండ్లు నిర్మించి ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది.

# శ్రీవాణి హైస్కూల్లో రోడ్డు భద్రత వారోత్సవాలు

**– తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి**

**– వనపర్తి జిల్లా అసిస్టెంట్ యం వి ఐ సైదులు నాయక్**



ఆత్మకూర్ జనవరి 23 తీన్మార్ న్యూస్:- వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని స్థానిక శ్రీవాణి హైస్కూల్లో గురువారం రోజు జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి వనపర్తి జిల్లా అసిస్టెంట్ యం వి ఐ సైదులు నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని డ్రైవింగ్ లైసెన్స్ వచ్చిన తరువాతనే వాహనాలు నడపాలని విద్యార్థులకు ఆయన సూచించారు ప్రతి సంవత్సరం 1,60 వేల మరణాలు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలంగాణలో ప్రతిరోజు 20 మరణాలు జరుగుతున్నాయని రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని రక్షించాలని పాఠశాల విద్యార్థులకు మరియు పాఠశాల డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలను ఆయన సూచించారు. అదేవిధంగా తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం పాల్గొని రోడ్డు ప్రమాదాల గురించి ఎలా రక్షించుకోవాలో పాటల రూపంలో విద్యార్థులకు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

## లేకుంటే కాలేజీలు బంద్ చేస్తాం

**– టీయూ వీసీకి కళాశాలల యాజమాన్యాల వినతి**



నిజామాబాద్‌సిటీ: బకాయిపడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే కాలేజీలను నిరవధికంగా బంద్ చేస్తామని కళాశాలల యాజమాన్యాలు తెలంగాణ యూనివర్శిటీ (టీయూ) వైస్ ఛాన్సలర్ ఆచార్య యాదగిరిరావు వద్ద మొరపెట్టుకున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా టీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మూడు సంవత్సరాలుగా బకాయి పడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను విడుదల చెయ్యకపోతే కాలేజీల నిర్వహణ తమకు సాధ్యం కాదని కళాశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి. వేల మంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పినా తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చెయ్యకుండా ప్రభుత్వం జాప్యం చేయడం అన్యాయమని అన్నారు. గత సంవత్సర కాలం నుంచి సిబ్బందికి జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. భవనాల అద్దెలు కూడా చెల్లించలేకపోతున్నామని తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వీసీకి విన్నవించారు. వీసీని కలిసిన వారిలో.. ప్రయివేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు హరిప్రసాద్, కార్యదర్శి సంజీవ్, మారయ్య గౌడ్, శంకర్, నరాల సుధాకర్, జైపాల్ రెడ్డి, బాలాజీ, గిరి, శ్రీనివాస్, సుజన్ రెడ్డి, శ్రీమతి మలేహా, దుష్యంత్, రమణ, శ్రీనివాస్ రెడ్డి, శివాజీ, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# 'కాజీపేట'కు మహర్దశ

**– అమృత్ భారత్ స్టేషన్ పథకంతో**

**– రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.24.45 కోట్లు**



వరంగల్ : 'అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్)' కింద కాజీపేట రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేసి రూ.24.45 కోట్ల అంచనా వ్యయంతో రైల్వే ప్రయాణీకుల సౌకర్యార్థం శరవేగంగా స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ పథకం కింద ఇప్పటికే రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్‌లను ఎంపిక చేశారు. వీటినిరూ.2,737 కోట్లతో ఆధునిక హంగులతో తీర్చిదిద్దనున్నారు. దానిలో భాగంగానే ప్రపంచస్థాయిలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌నూ అభివృద్ధి చేస్తున్నారు. జంట నగరాల్లో ఇప్పటికే రైల్వే టర్మినల్స్‌లో ఉన్న రద్దీని తగ్గించడానికి ప్రత్యామ్నాయ టర్మినల్‌గా చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో సకల సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఈ పథకం కింద కాజీపేట స్టేషన్ ఎంపిక కావడంతో అభివృద్ధి పనులను శరవేగంగా చేస్తున్నారు. కాజీపేట రైల్వే స్టేషన్‌ను నిజాం గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే (ఎన్‌జీఎస్ఆర్)లో భాగంగా 1888లో నిర్మించారు.నిజాం సంస్థానాన్ని బ్రిటీషు ఇండియాలోని మిగిలిన ప్రాంతాలకు కాజీపేట కలుపుతుంది. కాజీపేట రైల్వే స్టేషన్ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి బొగ్గు, పత్తి, ఇతర వస్తువుల రవాణాలో ఈ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుంది. సికింద్రా బాద్ డివిజన్ పరిధిలో కాజీపేట రైల్వే స్టేషన్‌ను నాన్ సబర్బన్ గ్రేడ్ 3 (ఎన్ఎస్‌జీ-3)గా వర్గీకరించారు. ఇక్కడ నుంచి ప్రతిరోజూ విజయవాడ, విశాఖపట్నం, సికింద్రాబాద్, తిరుపతి తదితర ప్రాంతాలకు వెళ్లే సూపర్‌ఫాస్ట్ రైళ్లు సుమారు 98 రైళ్లు ఇక్కడ ఆగుతుండగా.. వాటిద్వారా 24,269 మందికిపైగా ప్రయాణం సాగిస్తున్నారు. కాగా, స్టేషన్ అభివృద్ధి పనుల్లో ఇప్పటికే 40 శాతం పూర్తి కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 60శాతం పనులను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

# అర్హులైన పేదలకు పథకాలు అమలు పరచడం జరుగుతుంది..

**– అదనపు కలెక్టర్ (రెవిన్యూ)**



కామారెడ్డి: అర్హులైన పేదలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు పరచడం జరుగుతుందని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) విక్టర్ అన్నారు. గురువారం కామారెడ్డి మండలం నర్శన్నపల్లి, తాడ్వాయి మండలం సంతాయిపేట్ గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గత ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారికి పథకాలు అమలు కొరకు గ్రామసభలో జాబితాలను చదివి వినిపించడం జరుగుతుందని, అట్టి వాటిలో అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో తెలియజేయాలని అన్నారు. ఇంతకుముందు దరఖాస్తు సమర్పించనీ వారు ప్రస్తుత గ్రామసభల్లో ఏర్పాటుచేసిన కౌంటర్ లలో దరఖాస్తులు సమర్పించవచ్చునీ తెలిపారు. అట్టి దరఖాస్తులను తదుపరి పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులు స్వీకరించడం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీఓ రంగనాథ్ రావు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.అర్హులైన పేదలకు పథకాలు అమలు పరచడం జరుగుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మాచారెడ్డీ మండలం అక్కాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గత ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారికి పథకాలు అమలు కొరకు గ్రామసభలో జాబితాలను చదివి వినిపించడం జరుగుతుందని, అట్టి వాటిలో అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో తెలియజేయాలని అన్నారు. ఇంతకు ముందు దరఖాస్తు సమర్పించనీ వారు ప్రస్తుత గ్రామసభల్లో ఏర్పాటుచేసిన కౌంటర్ లలో దరఖాస్తులు సమర్పించవచ్చునీ తెలిపారు. అట్టి దరఖాస్తులను తదుపరి పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులు స్వీకరించడం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భూమి లేని పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

**– గ్రామసభల్లో అర్హులుగా ప్రకటించాలి**

**– ఉపాధి జాబ్ కార్డు, 20 రోజుల పనిదినాల నిబంధనలు ఎత్తివేయాలి**

**– ఈ విషయంపై గ్రామసభల్లో నిరసన తెలపాలి**

**– భూమిలేని పట్టణ పేదలకూ ఈ పథకాన్ని వర్తింపజేయాలి : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ**




హైదరాబాద్: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారులకు కచ్చితంగా ఉపాధి జాబ్ కార్డు, 20 రోజులు పని దినాలు ఉండాలనే నిబంధనలను తొలగించాలనీ, భూమి లేని పేదలందరినీ అర్హులుగా గ్రామసభల్లో ప్రకటించాలని, రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభల్లో నిరసనలను తెలియజేసి దరఖాస్తులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకున్న ప్రజా పాలన దరఖాస్తులలో భూమిలేని వ్యవసాయ కార్మికులు ఎంతమంది ఉన్నారో బహిరంగ ప్రకటన చేయాలని కోరింది. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టు భూమి లేని పేదలందరికీ ఇందిరమ్మ భరోసా ఇస్తామన్న వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసింది. గ్రామ సభల్లో 20 మంది 30 మందిని మాత్రమే లబ్దిదారులుగా ప్రకటించే చర్యలకు స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్ రాములు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 52.78 లక్షల జాబ్‌కార్డుల్లో 1,11,31,284 మంది కూలీలు పని కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో గత సంవత్సరం 56,78,097 మంది కూలీలకు మాత్రమే పని కల్పించారు. పని చేయడానికి సిద్ధంగా ఉన్న సగం మందికి పైగా ప్రభుత్వం పని చూపలేకపోయింది. ఇప్పుడు ప్రభుత్వం ఉపాధి కార్డు, పని దినాలను లబ్దిదారులకు ప్రాతిపదికగా తీసుకోవడమంటే లబ్దిదారుల సంఖ్యను కుదించటంతోపాటు నిజమైన వ్యవసాయ కూలీలుగా ఉన్న అనేక మందిని ఈ పథకానికి దూరం చేయడమే అవుతుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ పదేండ్లలో ఒక్క జాబ్‌కార్డు కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. పాత కార్డుల్లో కొత్తగా వచ్చిన పిల్లల పేర్లను చేర్చే అవకాశం కూడా కల్పించలేదు." అని వారు తెలిపారు. "బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ పనిని పేదలకు దూరం చేయడానికి అనేక విధానపరమైన చర్యలు చేపట్టింది. ఉపాధి జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌లో నెంబర్ల లింకు పేరుతో ఈ కాలంలో 7.5 కోట్ల జాబ్ కార్డులను తొలగించింది. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా నగర పంచాయతీలు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఏర్పాటు పేరుతో అనేక గ్రామాలను విలీనం చేయడం వల్ల లక్షలాది మంది జాబ్ కార్డులు, పని కోల్పోయారు. పని ప్రదేశంలో ఉదయం, సాయంత్రం ఫొటోల అప్‌లోడింగ్ పేరుతో ఆన్‌లైన్ మస్టర్ పద్ధతిని అమలు చేశారు. ఫలితంగా పని చేసిన కూలీల ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్ లోడ్ కాకపోవడంతో జాబ్ కార్డుల్లో పని దినాలు నమోదు కాని వారు లక్షల మంది ఉన్నారు. పని కోసం దరఖాస్తు పెట్టుకున్న వారిలో ఒంటరి మహిళలు, ముసలివారు, వికలాంగుల ఉన్నారనే నెపంతో అనేక మందికి ప్రభుత్వ అధికారులు పని చూపలేదు%ా%. " అని వారు చెప్పారు. పట్టణ పేదలకు ఉపాధి పని కల్పిస్తామన్న గత బీఆర్ఎస్ పాలకుల మాటలు, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం నీటి మూటలుగానే మిగిలాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం పునరాలో చన చేసి పట్టణ పేదలను కూడా ఈ పథకానికి లబ్దిదారు లుగా ఎంపిక చేయాలని నాగయ్య, వెంకట్ రాములు డిమాండ్ చేశారు.

# అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకూ ప్రభుత్వ పథకాలు

**– రేషన్ కార్డు జారీ నిరంతర ప్రక్రియ**

**– ప్రతి ఒక్కరికి 6 కిలోల సన్న బియ్యం**

**– అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు**

**– పంట వేసినా వేయకున్నా రైతు భరోసా..**

**– భూమిలేని కూలీకి 12,000**

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ పథకాలు అందుతాయని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా తిమ్మాపూర్ మండలం రేణికుంటలో గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అడుగు ముందుకు వేసిందని అన్నారు. ఎంతమందికి అర్హత ఉంటే అంతమందికీ రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. పెళ్లయిన వారికి విడిగా కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల మార్పు చేర్పులు అన్ని పూర్తి చేస్తామని అన్నారు. గతంలో మీసేవ, ప్రజావాణి, సర్వేలలో సమర్పించిన దరఖాస్తులన్నీ పరిశీలిస్తామని, అర్హత ఉన్న వారందరికీ కార్డు ఇస్తామని అన్నారు. గ్రామ సభల్లో ప్రకటించిన జాబితాలో పేర్లు లేకున్నా అదే సభలో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. 2014లో 90 లక్షల రేషన్ కార్డులు ఉంటే గత పది సంవత్సరాలలో కేవలం 40,000 మందికి మాత్రమే రేషన్ కార్డు ఇచ్చారని తెలిపారు.

ప్రస్తుతం ఈ ప్రభుత్వం 40 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇస్తుందని అన్నారు. అందరికీ రేషన్ కార్డు అందిన తర్వాత ప్రతి వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. అర్హత ఉన్న వాళ్లందరికీ ఇల్లు కట్టించే ప్రక్రియ చేపట్టామని, ఇండ్ల మంజూరు జాబితాలో పేరు లేకుంటే దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. స్వంతస్థలం ఉన్నవారు ఇల్లు కట్టు కునేందుకు ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నామని, ఎస్సీ ఎస్టీలకు మరో లక్ష ఆదనంగా ఇస్తామని తెలిపారు. సాగు చేసేందుకు యోగ్యంగా ఉన్న ప్రతి ఎకరానికి సంవత్సరానికి 12000 రైతు భరోసా ఇవ్వబోతున్నామని తెలిపారు. పంట వేసినా వేయకున్నా వ్యవసాయానికి ముఖ్యంగా ఉంటే రైతు భరోసా అందుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి 12,000 అందజేస్తున్నామని అన్నారు. ఈ స్థాయిలో ఇన్ని ప్రభుత్వ పథకాలు ఒకేసారి అమలు చేయడం చరిత్రలో ఎక్కడా లేదని తెలిపారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని అన్నారు. గతంలో ప్రజా పాలన సమయంలో దరఖాస్తు ఫారం సరిగ్గా నింపకపోవడం వల్ల ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామసభ పూర్తయిన తర్వాత కూడా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వవచ్చని అన్నారు. అన్ని దరఖాస్తులు పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పమేలా సత్పతి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

# నీటి కష్టాలకు చెక్..

హైదరాబాద్: ఎండాకాలం వచ్చిందంటే చాలు.. హైదరాబాద్ నగరంలో నీటి కష్టాలు మె?దలవుతాయి. హైటెక్ సిటీ నుంచి బస్తీల వరకు ఎక్కడ చూసినా వాటల్ ప్రాబ్లమే. స్లమ్ ఏరియాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అక్కడ వారం, పది రోజులకు ఒకసారి కూడా నీళ్లు రావు. గ్రౌండ్ వాటర్ అడుగంటిపోవటంతో ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదురవుతుంది. మరో రెండు నెలల్లో సమ్మర్ మె?దలు కానుంది. దీంతో ఈసారి ఎటువంటి నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని నగరవాసులు ఇప్పట్నుంచే టెన్షన్ పడుతున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. ఈసారి నీటి కష్టాలకు చెక్ పెట్టేందుకు కీలక నిర్ణయం తీసుకుంది.హైదరాబాద్ మహానగరం దాహార్తిని తీర్చేందుకు గోదావలి జలాలను వాడుకోవాలని డిసైడ్ అయింది. 20 టీఎంసీల గోదావరి జలాలను నగరానికి తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. గోదావరి రెండో దశ ప్రాజెక్టుకు వారంలో టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.7,360 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టనుండగా.. రానున్న 24 నెలల్లో పూర్తిచేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు మరో రెండ్రోజులు వెల్లడికానున్నాయి. గోదావరి నుంచి రెండో దశలో 15 టీఎంసీలు, మూడో దశలో 5 టీఎంసీలు నీటికి తీసుకురావాలని గతంలోనే నిర్ణయించారు. అయితే నగర తాగునీటి అవసరాలు భారీగా పెరిగిన నేపథ్యంలో రెండో దశలోనే 20 టీఎంసీలు తీసుకురావాలని తాజాగా డిసైడ్ అయ్యారు.హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చటంతో పాటుగా రేవంత్ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టులో భాగంగా జంటజలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు గోదావరి జలాలు తీసుకురానున్నారు. మె?త్తం నగర ప్రజల తాగునీటి అవసరాలకు 30 టీఎంసీలు కేటాయించగా.. ప్రస్తుతం 10 టీఎంసీలు వినియోగించుకుంటున్నారు.

# టైం స్కేల్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**– తెలంగాణ యూనివర్సిటీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షులు జే.వెంకటేష్**

**– వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ జానయ్యకు వినతి**



రాజేంద్రనగర్: రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న టైం స్కేల్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యూనివర్సిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షులు జే. వెంకటేష్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పద్మశ్రీ అన్నారు. ఇప్పటికైనా నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఉపకులపతి జానయ్య సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బుధవారం యూనివర్సిటీ ఉద్యోగులతో కలిసి వీసీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు గ్రాడ్యూటీ పెంచాలని, కార్మికులందరికీ రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సర్వీస్‌లో ఉన్న టైం స్కేల్ ఉద్యోగి మరణిస్తే.. వారి వారసులకి ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. దీన్ని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, టైం స్కేల్ ఉద్యోగులకు అందరికీ వర్తింప చేయాలన్నారు.

# మూకుమ్మడి సెలవులు పెడతాం

## ఒత్తిళ్లు భరించలేమంటున్న గ్రామ కార్యదర్శులు

వరంగల్: తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం 4 కీలక పథకాలకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించి గ్రామ సభలు నిర్వహిస్తోంది. అర్హులను గుర్తించే పనిలో పడింది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం లబ్ధిదారుల ఎంపిక జరుగుతోంది. లబ్ధిదారుల జాబితాను గ్రామ సభల్లో అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే.. ఈ కీలక ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ముఖ్యం. కానీ వారు ప్రస్తుతం గ్రామాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ప్రజలు దాడులు చేస్తారని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పని ఒత్తిడి పెరుగుతోందని వాపోతున్నారు. ప్రస్తుతం ప్రతీ మండలంలో ఖాళీలు ఉన్నాయి. ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీలకు ఇన్‌ఛార్జిలను నియమించి పనులు చేస్తున్నారు. దీంతో ఒత్తిడి పెరుగుతోందని అంటున్నారు. నగరాలు పట్టణాలతో పోలిస్తే.. గ్రామాల్లో పరిస్థితి వేరేలా ఉంటుంది. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు వారికి రాకపోతే ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటు అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు ఉన్నతాధికారుల దగ్గరకు వెళ్లలేక.. గ్రామాలకు వచ్చే పంచాయతీ కార్యదర్శులను నిలదిస్తున్నారు. ప్రస్తుతం ఉన్నవారిలో చాలామంది కొత్తవారు కావడంతో.. పరిస్థితులను ఎదుర్కోలేక భయపడుతున్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. అయితే జాబితాల్లో తమ పేర్లు లేకపోవడంతో గ్రామస్థులు అధికారులను నిలదీస్తున్నారు. దీంతో పలుచోట్ల గ్రామసభలు రసాభాసగా మారాయి. అధికారులు, పోలీసులు కల్పించుకుని గ్రామస్థులకు సర్ధిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పలుచోట్ల గ్రామసభలను గ్రామస్థులు బహిష్కరిస్తున్నారు. జాబితాల్లో పేర్లు ఉన్న వారు ఆనందం వ్యక్తం చేస్తుంటే... పేర్లు రాని వాళ్లు అధికారులపై ఫైర్ అవుతున్నారు. అర్హులను పక్కన పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. అర్హులందరికీ పథకాలు వస్తాయని, పేర్లు రానివాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారుగ్రామసభల్లో ఉద్రిక్తతలపై బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఇది ప్రజాపాలన కాదు, ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అంటూ విమర్శించారు. సోకాల్డ్ ప్రజాపాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా? అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామ సభల సాక్షిగా ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందన్నారు. ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడికక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతుందన్నారు."ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలె. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణం. పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా.? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? ఎన్నికల ముందు హామీలిస్తం, అధికారంలోకి వచ్చాక ఎగ్గొడతాం అన్నట్లుగా వ్యవహరిస్తే, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు.. అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారు. కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారింది. సమాధానం చెప్పలేని పరిస్థితి" – మాజీ మంత్రి హరీశ్ రావు"మీరు నిర్వహిస్తున్న గ్రామ సభలు దగా.. ఏడాది కాలంలో మీరు చేసిన దగాను ప్రజలు అర్థం చేసుకున్నారు. మీరు చేసిన మోసాన్ని, నయవంచనను తెలుసుకున్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తారు. అరెస్టులు చేసి నోళ్లు మూయిస్తారు. నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ పాలనను నిలదీస్తుంది. మరి ఇప్పుడు వారిపై ఎన్ని కేసులు పెడతారు. ఎంత మందిని అరెస్టులు చేస్తారు.మీ పాలనలో విసిగి, వేసారి పోయిన తెలంగాణ ప్రజలు ఉప్పెనగా ఉద్యమించక ముందే కళ్లు తెరవండి. ప్రతిపక్షాల మీద బురదజల్లడం మాని పరిపాలన మీద దృష్టి సారించండి. ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం"–మాజీ మంత్రి హరీశ్ రావు మరోవైపు పథకాలు అందని వారినుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇన్ని సమస్యల మధ్య ఉద్యోగం చేయడం కంటే.. మానేయడం ఉత్తమం అనే అభిప్రాయాలను పంచాయతీ కార్యదర్శులు వ్యక్తం చేస్తున్నారు.గ్రామసభల నేపథ్యంలో 'గ్రామ, వార్డు సభలు ప్రారంభం కాగానే గొడవలు స్టార్ట్ అయ్యాయి. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరస్పరం తిట్టుకున్నారు. పలుచోట్ల ఘర్షణలు జరిగాయి. మరికొన్నిచోట్ల అధికారులను ప్రజలు నిలదీశారు. తమపేర్లు జాబితాలో ఎందుకు లేవని గట్టిగా ప్రశ్నించారు. దీంతో గ్రామసభలకు వచ్చిన అధికారులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. 'మేం చేసే పని చేస్తున్నాం. అందరి పేర్లు ఎందుకు రాలేదంటే మాకెలా తెలుస్తుంది. గ్రామాల్లో ప్రజల మెప్పుకోసం రాజకీయ పార్టీల నాయకులు మమ్మల్ని తిడుతున్నారు. మరికొందరు తమపై దాడిచేయాలని ప్రజలను రెచ్చగొడుతున్నారు. మా గ్రామం కాకుండా ఇంకో గ్రామం బాధ్యతలు నాకే అప్పగించారు. పని ఒత్తిడి తీవ్రంగా ఉంది. పైగా బెదిరింపులు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పనిచేయడం కంటే ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటడం మేలు అనిపిస్తుంది' అని మహిళా పంచాయతీ కార్యదర్శి వాపోయారు.

## విద్యార్థులు దేశభక్తిని, క్రమశిక్షణను అలవర్చుకోవాలి..



కమ్మర్ పల్లి : విద్యార్థులు దేశభక్తిని, క్రమ శిక్షణను అలవర్చుకోవాలని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు రాజన్న అన్నారు. గురువారం మండలంలోని ఉప్లూర్ ఉన్నత పాఠశాలలో నేతాజీ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రాజన్న మాట్లాడుతూ నేతాజీ మన దేశానికి చేసినటువంటి సేవలు, ఆయన చేసిన త్యాగం, ఆయన అసంచలమైన దేశభక్తి గురించి కొనియాడారు. వారి నుండి విద్యార్థులు స్ఫూర్తి పొంది దేశభక్తిని, క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు సిరిమల్ల దేవన్న, సల్లూరి కిషన్ గౌడ్, రవీందర్, మహికాంత్, గోపాల్, పద్మ, సుమలత, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి..




కంఠేశ్వర్ : భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యు ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పెద్ది సూరి మాట్లాడుతూ 1879లో జనవరి 23న ఒడిశాలోని కటక్‌లో జానకీ నాథ్, ప్రభావతీ బోస్‌లకు సుభాష్ చంద్రబోస్ జన్మించడం జరిగిందని అన్నారు.. అదేవిధంగా గాంధీజీ స్ఫూర్తితో జాతీయోద్యమంలో చేరి, స్వాతంత్ర ఉద్యమంలో గాంధీజీ అహింస విధానాన్ని విభేదించి బోస్ సాగించిన పోరాటం దేశ చరిత్రలో ఒక ఉజ్వల ఘట్టంగా నిలిచిందన్నారు. అలాగే స్వాతంత్రానికి సాయుధ సంగ్రామమే మార్గమని ప్రకటించి, స్వాతంత్ర భరతావని ఒక్కటే మనకు స్వర్గమని చాటి , ప్రత్యేక సైన్యాన్ని సమకూర్చుకొని ఆంగ్లేయులతో పోరాడిన ధీరుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. అదేవిధంగా మీ రక్తాన్ని ఇవ్వండి స్వాతంత్రాన్ని ఇస్తాను అనే నినాదాలతో భారతదేశ ప్రజలందరిలో దేశభక్తి స్ఫూర్తిని నింపి, మహిళలను కూడా స్వాతంత్రోద్యమంలో భాగం చేసి స్వాతంత్రోద్యమం కోసం జరిపిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకంగా ఉందని అన్నారు. అదేవిధంగా నేటి భారత పౌరులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా,విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని అలాగే దేశ అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యు ఎస్ ఎఫ్ ఐ నగర కార్యదర్శి పోషమైన మహేష్ నగర ఉపాధ్యక్షులు వేణు, మారుతి మరియు నగర కమిటీ సభ్యులు సాయి,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డి స్థానంలో...నరేందర్ రెడ్డి

కరీంనగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు అయినట్లేనా? గాంధీభవన్ పెద్దలు ఆ ఆశావహుడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసారా? ఇంతకాలం ప్రచారానికే పరిమితం అయిన ఆ క్యాండెట్ నాలుగు జిల్లాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలని కలుస్తూ.. మద్దతు కోరుతుండటంతో ఆయనకి లైన్ క్లియర్ అయినట్లే అంటున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రెస్టేజియస్‌గా తీసుకున్న కాంగ్రెస్ ఈ సారి సిట్టింగ్ ఎమ్మెల్సీని కాదని.. ఎన్నో వడపోతల తర్వాత ఆయనని ఓకే చేసిందంట. ఇంతకీ కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేయబోయే అభ్యర్థి ఎవరు?కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి పదవీ కాలం మార్చితో ముగియ నుంది. దాంతో ఆ స్థానానికి ఎన్నికల కమిషన్ త్వరలో షెడ్యూల్ విడుదల చేయనుంది. ఆ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఇప్పటికే బీజేపీ తమ అభ్యర్థిని ప్రకటించింది. బీఆర్ఎస్ అసలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తుందా? లేదా? అన్నది క్లారిటీ లేదు. దానికి సంబంధించి కారు పార్టీలో ఆశావహులు కూడా కనిపించడం లేదు. పార్టీ ముఖ్య నేతలు కూడా దానిపై సడీ సప్పుడూ చేయడం లేదు.ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం పరిధిలోని నాలుగు పార్లమెంట్ సెగ్మెంట్లలో బీజేపీ ఎంపిలే ఉన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు . అటు బీజేపీ ఎంపీలు, ఇటు కేంద్ర మంత్రికి ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది.. ఆ క్రమంలో అసలు పోటీ బీజేపీతోనే అని భావిస్తున్న కాంగ్రెస్ బలమైన సామాజిక వర్గం, అన్ని విధాలా బలమైన అభ్యర్థి కోసం పెద్ద కసరత్తే చేస్తుంది. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న జీవన్‌రెడ్డి బీజేపీని ఎదుర్కోవడానికి సరిపోరని భావిస్తున్న కాంగ్రెస్ పెద్దలు కొత్త అభ్యర్థి కోసం అన్వేషించి ఫైనల్ చేసినట్లు తెలిసింది.జీవన్ రెడ్డి సామాజిక వర్గానికే చెందిన నరేందర్ రెడ్డి పేరు కూడా పరిశీలించిన కాంగ్రెస్ ఆయన వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అర్థికంగా అండదండలు అభ్యర్థి కావాలి కాబట్టి జీవన్ రెడ్డి కాకుండా నరేందర్ రెడ్డినే బరిలోకి దింపాలని భావిస్తున్నారంట. మొదటినుండి కుడా నరేందర్‌రెడ్డికి కాంగ్రెస్‌తో సత్సంబంధాలు ఉన్నయి. గత పదిహేను సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కి సపోర్ట్ చేస్తూ వస్తున్నారు. గత ఎమ్మెల్యే , ఎంపి ఎన్నికలలో కూడా టికెట్ ఆశించారు. కాని సామజిక సమీకరణాలు అనుకూలించక పోవడంతో అవకాశం దక్కలేదు.నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలలో ఖచ్చితంగా పోటీ చేయాలన్న ఉద్దేశంతో ఆరునెలల ముందు నుంచే అస్త్రాలని సిద్ధం చేసుకుని ప్రచారంలో దూసుకుపోతున్నాడు. గత ముప్పై ఏళ్లకి పైగా విద్యారంగంలో ఉండడం ఆయనకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కలిసివచ్చే అంశంగా మారింది. ఇప్పటికే తన పూర్వ విద్యార్థులు, తన స్టాఫ్‌తో దాదాపుగా అరునెలలుగా గ్రాడ్యుయేట్ ఓటర్లలో ప్రచారం కొనసాగిస్తున్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేతగా వూట్కూరి నరేందర్ రెడ్డి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అందరికీ సుపరిచితులే.కరీంనగర్ లో అల్ఫోర్స్ కళాశాల ప్రారంభించిన నరేందర్‌రెడ్డి ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి అదిలాబాద్, ఉమ్మడి నిజామాబాదు జిల్లాల వ్యాప్తంగా అల్ఫోర్స్ శాఖలు నిర్వహిస్తున్నారు. నాలుగు జిల్లాలలో పరిచయం అక్కరలేని పేరు నరేందర్ రెడ్డిది. అరునెలల నుండి నాలుగు జిల్లాల పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ పట్టభద్రుల ఓటర్లు నమోదు చేపించడంలో సక్సెస్ అయ్యారు. ఇప్పటికే పీసీసీ పెద్దలు, ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల ఆశీర్వాదాలు తీసుకున్నారంట. ఇటీవల ముఖ్యమంత్రి వేములవాడ పర్యటనకి వచ్చిన సందర్భంగా పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ హోర్డింగ్‌లు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి అందరి దృష్టిలో పడ్డారు పట్టభద్రుల ఓటర్లని కలుస్తూ మద్దతూ కోరిన అయన ఇప్పుడు ట్రెండ్ మార్చి నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే లని కలుస్తూ మద్దతు కూడ గట్టుకునే పనిలో పడ్డారు. ఇప్పుడు అదే నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వం ఖరారు అయిందన్న ప్రచారానికి బలం చేకూరుస్తుంది. అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడం వల్లే ఆయన వరుసగా ప్రజాప్రతినిధులను కలుస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కూడా నాలుగు జిల్లాల నేతల అభిప్రాయ సేకరణ చేపట్టారంట. దాంతో చాలా మంది కాంగ్రెస్ సీనియర్లు, ఎమ్మెల్యే లు నరేందర్ రెడ్డి పేరు ప్రతిపాదించారంట.మొదటి నుంచి సీనియార్టీ దృష్ట్యా ఎమ్మెల్సీ టికెట్ తిరిగి జీవన్ రెడ్డికే ఇస్తారని ప్రచారం జరిగింది. టీ పీసీసీ నాయకత్వం కూడా జీవన్ రెడ్డి పేరొక్కటే ఢిల్లీ అధిష్టానానికి పంపిందంట. అయితే నెలరోజుల వ్యవధిలో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఎమ్మెల్సీ సీటును ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని కాంగ్రెస్ భావిస్తుంది. సామజికంగా, అర్థికంగా బలం గా ఉన్న వారు అయితే ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం సాధిస్తామని, ఎట్టి పరిస్థితిల్లో పట్టు సడల కూడదన్న పట్టుదలతో నరేందర్ రెడ్డి పేరుని ఒకే చేసినట్లు ప్రచారం జరుగుతుంది.కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకి కూడా నరేందర్ రెడ్డి పేరుని కన్ఫర్మ్ చేస్తూ ఆయనకు సహకరించాలని ఆదేశాలు వెళ్లాయంట. అందుకే ఎమ్మెల్యేలు కూడా నరేందర్ రెడ్డి కే కన్ఫర్మేషన్ అవుతుందని క్యాడర్‌కి చెప్తున్నారంట. మరి అఫిషియల్ ప్రకటన ఎప్పుడుంటుందో చూడాలి.

## వేతనం పెంచకపోగా ఉన్న జీతంపైనే కోతలా..?



### – వేతనాలు పెంచాలని టోల్ ప్లాజా సిబ్బంది ధర్నా

భిక్కనూర్: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా భిక్కనూర్ టోల్ ప్లాజా వద్ద ప్లాజా కార్మికులు, సిబ్బంది ధర్నా నిర్వహించారు. జనవరి 30న టెండర్ ముగియనుండటంతో టీబీఆర్ కంపెనీ 20 సంవత్సరాల కాంట్రాక్టు తీసుకున్నట్టు తెలిపారు. 9 సంవత్సరాల నుంచి టోల్‌ప్లాజా వద్ద ఉద్యోగాలు కొనసాగిస్తూ జీవనం గడుపుతున్నామని, ఉన్న జీతమే సరిపోకపోగా.. ప్రస్తుతం నాలుగు వేలు తగ్గించారని, దాంతో ధర్నా నిర్వహించినట్టు తెలిపారు. టోల్ ప్లాజా కార్మికులకు అందరికీ కనీస వేతనం, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. టీబీఆర్ యాజమాన్యాం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వవిద్యాలయాలను విధ్వంసం చేయొద్దు

### – యూజీసీ మార్గదర్శకాలను కేంద్రం వెనక్కి తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్




హైదరాబాద్: సంస్కరణల పేరుతో విశ్వవిద్యాలయాలను విధ్వంసం చేయొద్దని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. అవి అమల్లోకి వస్తే విశ్వవిద్యాలయాలు కేంద్రం గుప్పెట్లోకి వెళ్తాయనీ, రాష్ట్రాల హక్కులు హరించబడతాయని విమర్శించింది. బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో యూజీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు మాట్లాడుతూ యూజీసీ మార్గదర్శకాలపై ఇప్పటికే కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఈ ముసాయిదాను వ్యతిరేకిస్తూ నిర్ణయం తీసుకున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కూడా వెంటనే యూజీసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆ ముసాయిదా అమల్లోకి వస్తే వర్సిటీలు ధ్వంసమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ముఖ్యంగా వీసీల నియామకాల్లో రాష్ట్రాలకు ఎలాంటి అధికారం ఉండబోదని అన్నారు. ప్రస్తుత విధానం ప్రకారం వీసీల నియామకాల కోసం ప్రభుత్వం, విశ్వవిద్యాలయం, యూజీసీ నుంచి ఒకరు చొప్పున సభ్యులతో సెర్చ్ కమిటీ ఏర్పడుతుందని వివరించారు. అది పరిశీలించి ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లతో జాబితాను ప్రభుత్వానికి పంపిస్తుందని అన్నారు. వాటిని పరిశీలించి ప్రభుత్వం గవర్నర్ ఆమోదానికి ఆ జాబితాను పంపిస్తుందన్నారు. గవర్నర్ ఆమోదం తర్వాత వీసీని ప్రభుత్వం నియమిస్తుందని చెప్పారు. కానీ యూజీసీ తాజా ముసాయిదా ప్రకారం వీసీల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పాత్ర ఉండబోదని అన్నారు. వీసీని గవర్నర్ ఎంపిక చేస్తారని చెప్పారు. వీసీలుగా ఎవరిని నియమించాలనే విషయంలో కూడా యూజీసీ మార్పులు చేయాలని నిర్ణయించిందని అన్నారు. ఇప్పుడున్న పద్ధతి ప్రకారం వీసీ పోస్టుకు అర్హత సాధించాలంటే కనీసం 10 ఏండ్లపాటు ప్రొఫెసర్‌గా పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. కానీ ముసాయిదాలో దీన్ని తొలగించారని విమర్శించారు. వీసీ కోసం పారిశ్రామికవేత్తలతోపాటు, వివిధ రంగాల్లో నైపుణ్యం ఉన్న మేధావులు, పరిశోధనా ప్రతినిధులు, పాలనా అనుభవం ఉన్న వారు అర్హులని ప్రకటించిందని గుర్తు చేశారు. వర్సిటీల్లో పనిచేయనివారు, ప్రొఫెసర్లు కానివారు ఎవరైనా వీసీలుగా ఎంపికయ్యే అవకాశముందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తులను వీసీలుగా నియమించే కుట్ర ఉందని విమర్శించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల నియామకాల్లో యూజీసీ మార్పులు చేస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం ఈ పోస్టులకు అర్హత సాధించాలంటే ఒకే సబ్జెక్టులో పీజీ, పీహెచ్‌డీ చేసి ఉండాలన్నారు. యూజీసీ ముసాయిదా ప్రకారం గ్రాడ్యుయేషన్, పీజీలో ఏ సబ్జెక్టు చదివినా, పీహెచ్‌డీ చేసిన సబ్జెక్టుతో సంబంధం లేకుండా ప్రొఫెసర్ పోస్టులకు అర్హత సాధించే అవకాశముందని అన్నారు. ఇప్పటికే బీజేపీకి అనుకూలమైన వ్యక్తులతో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా సిలబస్ మార్పులు కూడా జరుగుతున్నాయని అన్నారు. యూజీసీ ముసాయిదా ద్వారా వర్సిటీలను కేంద్రం ఆధీనంలోకి తీసుకునే దిశగా కుట్ర చేస్తోందన్నారు. ఈ మార్గదర్శకాలను వెనక్కి తీసుకునే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటంలో విద్యార్థులు, ప్రొఫెసర్ల భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్, శ్రీకాంత్ వర్మ, శంకర్, రాష్ట్ర సహాయకార్యదర్శులు కిరణ్, అశోక్‌రెడ్డి, ప్రశాంత్, శంకర్, శ్రీకాంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, నాయకులు శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత..



తిరుమలగిరి సాగర్: వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా తిరుమలగిరి సాగర్ ఎస్ఐ వీరశేఖర్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పక్కా సమాచారం మేరకు బుధవారం తెల్లవారు జామున సుమారు 3.30 గంటల సమయం లో రంగుండ్ల గ్రామం లో అంగోతు రుక్మకి చెందిన రేషన్ షాప్ నుండి ఆమె కుమారుడు అంగోతు శంకర్ రేషన్ బియ్యాన్ని కల్వకుర్తికి చెందిన డిసిఎం లో 43 క్వింటాల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు.

# గ్రామ సభలో రైతు ఆత్మహత్యాయత్నం..!



హైదరాబాద్ : మంత్రి సీతక్క సొంత నియోజకవర్గం ములుగులో విషాదం చోటు చేసుకుంది. ప్రభుత్వ పథకాల అర్హుల జాబితాలో తన పేరు లేదని ఓ రైతు ఏకంగా గ్రామ సభలోనే అధికారుల ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామ సభ ఏర్పాటు చేశారు. అయితే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకరించిన ప్రజా పాలనలో పలు సంక్షేమ పథకాలకు కుమ్మరి నాగేశ్వరరావు అనే రైతు అప్లికేషన్ చేసుకున్నాడు. అయితే ఇవాళ గ్రామ సభ లో వివిధ పథకాలకు సంబంధించినటువంటి అర్హుల జాబితాను అనౌన్స్ చేయగా.. తాను పెట్టిన అర్జీలకు దేనికి అర్హుడను కాలేదని మనస్థాపానికి గురై.. అధికారుల ముందే పురుగుల మందు తాగాడు. అయితే అతన్ని అధికారులు, ప్రజలు నిలవరించేందుకు ప్రయత్నించాడు. అప్పటికే అతను పరుగుల మందు సగానికి పైగా తాగడంతో హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. రైతు పరిస్థితి విషమంగామారడంతో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతనికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

# 'ఆమె'కు అన్నీ అగచాట్లే

- పాలకుల హామీలు నీటి మూటలే తగిన ఉపాధి లేక సతమతం
- ధరల మోతలు.. మహిళల వెతలు
- చట్టుబండల్లా చట్టాలు
- ఆగని దాడులు, దౌర్జన్యాలు
- మహిళా పోరాటాలకు ఐద్వా ప్రణాళికలు

హైదరాబాద్: మొన్నటిదాకా కండ్లకు గుడ్డను కట్టి న్యాయదేవతగా నిలబెట్టారు స్త్రీని. ఎంత భారమైనా ఓపికతో మోసే భూమినీ తల్లిగా చేసి కొలిచారు. పురాణాలు, ఇతిహాసాలలో శక్తి స్వరూపిణి అనీ, సర్వశక్తిమంతురాలనీ, కీర్తనలు, వర్ణనలతో పొగడ్తలను వెల్లువెత్తించారు. కానీ నిజజీవితంలో 'ఆమె'కు అన్నీ అవమానాలు, అగచాట్లే.. బలహీనురాలుగా, రెండో తరగతి పౌరురాలుగానే చూడటంతో ఆగకుండా 'ఆమె'ను వ్యాపార 'సరుకు'ను చేస్తూ.. ఓట్లేసే యంత్రాలుగా పాలకులు చూస్తు న్నారు. వారి ఓట్లు కొల్లగొట్టేందుకు ఆకర్షణీయ హామీలు గుప్పిస్తున్నారు. అవి ఆ తర్వాత నీటి మూటలుగా మారుతున్నాయి. ఆదాయాలు గొర్రెతోక బెత్తడుగా ఉంటే.. నిత్యావసర సరుకుల ధరల నింగినంటుతున్నాయి. దీంతో ఇంటిని చక్కదిద్దుతున్న ఆమెపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది.




**దాడులు..వేధింపులు..**

మహిళలపై దాడులు, దౌర్జన్యాలు రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టడంలో పాలకులు విఫలమవుతున్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా వారి భద్రత కోసం సర్కారు చట్టాలు రూపొందించినా..వాటి అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నది. లైంగిక దాడుల నుంచి రక్షణకు కఠిన చర్యలు తీసుకోవటంలో బుద్ధిపూర్వకంగానే సరైన విధంగా అవలంబించడం లేదని మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి. గతేడాది హెల్ప్‌లైన్, 'సఖి'లో 12 వేలకు పైగా కేసుల నమోదయ్యా యంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నమోదు కాని కేసులు రెట్టింపుగా ఉంటాయని తెలుస్తున్నది.

# వృత్తులు బతికితేనే..ఊరికి ఊపిరి

- నీటి బుడగల్లా సర్కారు హామీలు
- కార్పొరేషన్లున్నా..నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం
- యాంత్రీకరణ దెబ్బకు కుదేలు
- పట్టణాలకు వలసబాటొౌఅక్కడా తప్పని అగచాట్లు




రాష్ట్రంలో 25 లక్షల మంది 17 రకాల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే అవి క్రమంగా ఆదరణ కోల్పోతున్నాయి. దీంతో ఊర్ల కళ తప్పుతున్నాయి%ొ% 'వృత్తులు బతికితేనే ఊరికి ఊపిరుంటది' అన్న నానుడి నేడు కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తోన్నది. బడుగు, బలహీన వర్గాల వారు వీటి ఆసరాతోనే ఎక్కువగా బతుకు బండి లాగుతారు. ఇతర గ్రామీణ పేదలకు కూడా ఇవి ఆదెరువుగానే ఉంటాయి. ప్రపంచీకరణ, సరళీకరణ నేపథ్యంలో వృత్తులు కొన్ని దెబ్బతింటున్నాయి ఫలితంగా అనేక మంది ఉపాధి కోల్పోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగే కాంగ్రెస్ కూడా వృత్తిదారులకు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. వృత్తి చేస్తున్న వారికి ఉపాధి కలిగే విధంగా చర్యలు చేపట్టడం లేదు. రాష్ట్రంలో చేతి వృత్తుల ప్రాతిపదికన 14 కార్పొరేషన్లు, ఫెడరేషన్లు ఉన్నాయి. వీటికి నామమాత్రపు బడ్జెట్ కేటాయింపులు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటున్నది. ఓట్ల కోసం కొన్ని పథకాలు ప్రవేశపెట్టడం తప్ప వారి ఉపాధి మెరుగు పరచటానికి, అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. వృత్తిదారుల సమన్వయ కమిటీ, వాటి సంఘాల ఆధ్వర్యంలో వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు ఆందోళనలు, పోరాటాలు నిర్వహించటం ద్వారా కొన్ని సమస్యలను పరిష్కరించుకున్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం భవిష్యత్‌లో సమరశీల పోరాటాలకు శ్రీకారం చుట్టబోతున్నా మంటూ వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ తెలిపారు.

# హైదరాబాద్ పాడ్ ట్యాక్సీ?

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. కొన్నిసార్లు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద గంటల తరబడి వెయిట్ చేయాల్సిన పరిస్థితి. కి.మీ మేర వాహనాలు బారలు తీరుతాయి. అలా ట్రాఫిక్‌లో చిక్కుకుపోవటం నరకంలా అనిపిస్తుంటుంది. దీంతో చాలా మంది మెట్రోలను ఆశ్రయిస్తున్నారు. మెట్రో ట్రైన్లలో నగరం ఓ మూల నుంచి మరో మూలకు వెళ్లేవారు ఈజీగా ప్రయాణాలు సాగిస్తున్నారు. త్వరలో మరింత ఈజీగా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జర్నీ చేయవచ్చు. నగర ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెడుతూ.. పాడ్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రభుత్వం–మెట్రోరైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) భాగస్వామ్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారుపాడ్ ట్యాక్సీలను పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్‌గా వ్యవహరిస్తుంటారు. ఇవి బ్యాటరీ లేదంటే కరెంట్‌తో పని చేస్తాయి. పర్యావరణహితంగా ఉండే కారు లాంటి క్యాబిన్‌లో 6-8 మంది ప్రయాణించొచ్చు. వీటిలో డ్రైవర్లు ఉండరు. ప్రయాణికులు ఇందులో కూర్చున్న తర్వాత.. తాము వెళ్లాలనుకునే గమ్యాన్ని ఎంచుకోవటానికి టచ్ ప్యాడ్లు ఉంటాయి. అక్కడ క్లిక్ చేస్తే చేరాల్సిన గమ్యాలకు తీసుకెళ్తాయి. బస్టాండ్లు, మెట్రో స్టేషన్ల నుంచి నేరుగా ఆఫీసులకు వెళ్లేలా వీటిని రూపొందిస్తారు. భారీ టవర్లు ఉండే భవనాలు, కార్యాలయాలకు కూడా వెళ్లేలా డిజైన్ చేస్తారు. అందుకోసం ప్రత్యేకంగా మార్గాలను ఏర్పాటు చేస్తారు.రానున్న మూడేళ్లలో ఈ పాడ్ ట్యాక్సీలను హైదరాబాద్ నగరంలో పట్టాలెక్కించాలని యోచిస్తున్నారు. ముందుగా నగరంలో అత్యంత రద్దీగా ఉండే రెండు మార్గాల్లో తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారట. రాయదుర్గం – కొండాపూర్, రాయదుర్గం – నాలెడ్జ్ సిటీ మార్గం మధ్య ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ రెండింటి మధ్య దూరం 14.8 కి.మీ. కాగా.. మొత్తం 55 స్టాప్‌లు ఏర్పాటు చేయనున్నారు. వీటి గరిష్ఠ వేగం గంటకు 40 కి.మీ. హెచ్ఎంఆర్ఎల్ డీపీఆర్ ప్రకారం.. ట్రాఫిక్ రద్దీ వేళల్లో ఈ పాడ్‌కార్ల ద్వారా గంటకు 10 వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాన్ని చేరుకుంటారని అంచనా. రోజుకు లక్ష మందిని ఈజీగా గమ్యస్థానాలకు చేర్చవచ్చు. ఈ రకమైన వ్యవస్థతో హైదరాబాద్‌లో పట్టణ రవాణా మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ముంబైలోని బాంద్రా–కుర్ల కాంప్లెక్స్ మధ్య పాడ్ ట్యాక్సీ కారిడార్ వ్యవస్థ నిర్మితమవుతోంది. గ్రేటర్ నోయిడా నుంచి నోయిడా ఎయిర్‌పోర్ట్ వరకు మరో లైన్ నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధమైంది. హైదరాబాద్ విషయానికొస్తే.. మెట్రోరైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) రూ.1,480 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా లేదా ఫిబ్రవరి మొదటి వారంలో డీపీఆర్‌ను ప్రభుత్వానికి సమర్పించి ఆ తర్వాత అనుమతులు, నిధులు కోరనున్నట్లు తెలిసింది.

# టీచర్ల డిప్యూటేషన్లలో అమ్యామ్యాలు

- పైరవీలకు పెద్ద పీట.. కలెక్టర్ ఆగ్రహం
- పరస్పర బదిలీల్లో భారీ చెల్లింపులు
- ముగ్గురు సభ్యుల కమిటీ నియామకం
- స్కావెంజర్ల వేతనాల నిలిపివేతతో ఆందోళన




వరంగల్: వరంగల్ జిల్లాలో టీచర్ల డిప్యూటేషన్లు వివాదాస్పదంగా మారాయి. పనుల సర్దుబాటులో భాగంగా డిప్యూటేషన్ల ప్రక్రియలో డబ్బులు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఈ వివాదం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దృష్టికి రావడంతో ఈ అక్రమాలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే త్రిసభ్య కమిటీని నియమించారు. అంతేకాదు, పరస్పర (మ్యుచువల్) బదిలీల్లో రూ.7 లక్షల నుంచి రూ.14 లక్షల మేరకు నగదు చేతులు మారినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కలెక్టర్ వద్దకు వచ్చిన విద్యా శాఖకు సంబంధించిన పలు బిల్లులు నిలిచిపోయాయి. ఇందులో స్కావెంజర్ల వేతనాల బిల్లులు సైతం పెండింగ్‌లో ఉండటంతో 4 నెలలుగా వారికి వేతనాలు అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో టీచర్లకు పరస్పర బదిలీలకు అవకాశం ఇవ్వడంతో భారీగా నగదు చేతులు మారుతుందన్న ప్రచారం జరుగుతుంది. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నవాళ్లు, డబ్బులు అవసరమున్న టీచర్లు పరస్పర బదిలీలకు అంగీకరిస్తూ భారీగా నగదును ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 6 జిల్లాల్లో ఈ పరిస్థితి చోటుచేసుకుంది. సంగెం మండలం మొండ్రాయి నుంచి ఒక సంఘానికి చెందిన టీచర్‌ను నగరంలోని శంభునిపేట పాఠశాలకు డిప్యూటేషన్‌పై నియమించడం, ఈ నియామకం వెనుక అవినీతి చోటు చేసుకున్నట్టు ప్రచారం జరుగుతుంది. ఒక సంఘానికి చెందిన నేతలే ఈ అక్రమ డిప్యూటేషన్లకు దళారులుగా వ్యవహరిస్తున్నారని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ టీచర్లను కస్తూర్ బా స్కూల్స్, మోడల్ స్కూల్స్‌కు డిప్యూటేషన్‌కు పంపడం కూడా వివాదాస్పదంగా మారింది.

# జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి


## బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలి

- కొమిరెడ్డి కరం చంద్ లేదా కొమిరెడ్డి విజయ్ ఆజాద్ లకు ఇవ్వాలి
- జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కటుకం చంద్రశేఖర్

జగిత్యాల: జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని,బీసీ వర్గానికి చెందిన కొమిరెడ్డి కరం చంద్ లేదా కొమిరెడ్డి విజయ్ ఆజాద్ లకు ఇవ్వాలని జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కటుకం చంద్రశేఖర్ కాంగ్రెస్ అధిష్టానానికి కోరారు. ఏఐసీసీ అధినేత మల్లి ఖర్జునాఖర్గే లోకసభ ప్రతిపక్ష నాయకుడు ఎంపీ రాహుల్ గాంధీ పార్టీపరంగా బీసీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించాలనే లక్ష్యంతో ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగనన సర్వే చేపట్టిన నేపథ్యంలో సామాజిక ఆర్థిక విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో వెనుకబడిన బీసీ సామాజిక వర్గాలకు రాజకీయ రంగంలో ప్రభుత్వం పెద్దపీట వేస్తూ పార్టీ పదవులలో వారికి సముచిత స్థానం కల్పించాలని జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కటుకం చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.కోరుట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అటు రాష్ట్రంలో గాని ఇటు నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో గాని అత్యధిక జనాభా కలిగి పార్టీ కోసం పాటు పడ్డా బీసీలకు టికెట్లు కేటాయించ కుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రస్తుతం జిల్లా డిసిసి అధ్యక్షున్ని మారుస్తున్నా రన్న ఊహాగానాల నేపథ్యంలో అట్టి పదవిని స్వర్గీయ మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి రాములు జ్యోతి దేవి తనయులు, సుప్రీంకోర్టు న్యాయవాది కొమిరెడ్డి కరంచంద్ లేదా కొమిరెడ్డి విజయ్ ఆజాద్ కు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు..

# ఆదివాసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు
- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం వినతి



హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆదివాసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధులు ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు, పూసం సచిన్ మాట్లాడుతూ.. ఇల్లు లేని ప్రతి ఆదివాసీ కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు అందజేయాలని కోరారు. "ఆదివాసుల అసైన్మెంట్ భూములను తిరిగి అసైనీలకి అన్ని హక్కులతో పునరుద్ధరించాలి. భూ సేకరణ చట్టం 2013 ప్రకారం భూములను సేకరించినప్పుడు అసైన్డ్ భూములకు పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లించాలి. అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి అర్హులైన అందరికీ పోడు భూముల పట్టాలు పంపిణీ చేయాలి.

ప్రతి ఆదివాసీ గూడెం గ్రామ పంచాయతీలకు ఏటా రూ. 25 లక్షలు కేటాయించాలి. ఆదివాసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆ కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల నిధులు మంజూరు చేయాలి. ఆదివాసీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయాన్ని అంబేద్కర్ అభయహస్తం పేరుతో అందజేయాలి. బడ్జెట్లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి ఖర్చు చేయాలి. అన్ని ఐటీడీఏ కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను స్థాపించాలి.

ఆదివాసీ విద్యార్థులు 10వ తరగతి పాస్ అయిన వారికి రూ.10 వేలు, ఇంటర్ ఉత్తీర్ణులకు రూ. 15వేలు, గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తే రూ.25 వేలు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తే రూ.లక్ష అందజేయాలని అన్నారు. ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆదివాసీ యువతకు రూ.5 లక్షలు అందజేయాలి. ప్రతి మండలంలో ఒక గురుకులం ఉండేలా ఆదివాసీ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేయాలి. ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టడంతో పాటు గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ చదివే ఆదివాసీ విద్యార్థులందరికీ హాస్టల్ సదుపాయం కల్పించాలి" అని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవి కుమార్, లంక రాఘవులు, ఎరామ పున్నం, అత్రం తనుష్, సహాయ కార్యదర్శులు పోలెం రాజేందర్, కారం పుల్లయ్య, కోట శ్రీనివాస్, గొంది రాజేష్, తొడసం శంభు, రాష్ట్ర కమిటీ సభ్యులు కోరేంగ మాలశ్రీ, బైరి సోమేష్, గౌరీ నాగేశ్వరరావు, మడవి రమేష్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

# నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తాం:

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కరీంనగర్: ప్రభుత్వ పథకాల అమలుకు గ్రామసభల నిర్వహణలో భాగంగా గంగాధర మండలం నారాయణపూర్ లో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నారాయణపూర్ రిజర్వాయర్ ను సందర్శించారు. అనంతరం గ్రామసభలో మాట్లాడుతూ గత ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి తక్కువ ఆయకట్టుకు నీరిచ్చిందని అన్నారు. ఈ ప్రభుత్వం తక్కువ ఖర్చులో ఎక్కువ ఆయకట్టుకు నీరు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రాజెక్టుల జాబితాలో నారాయణపూర్ రిజర్వాయర్ ను చేరుస్తామని తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి అవసరమైన సుమారు 70 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రకటించారు. ఏడాదిలోగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీళ్లు అందిస్తుందని అన్నారు. రిజర్వాయర్ ముంపు విషయంలో నారాయణపూర్ ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు. నారాయణపూర్ లో నాలుగు ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం వర్తించేలా చూస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగును నింపేందుకు తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని వివరించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న వారందరికీ కార్డు అందుతుందని తెలిపారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, ఈనెల 26న మరో నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని,ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.

జనవరిలోనే ఎల్లంపల్లి జలాలు విడుదల.

గతంలో ఎప్పుడూ లేనివిధంగా జనవరి మాసంలోనే నారాయణపూర్ జలాశయానికి ఎల్లంపల్లి నీరును విడుదల చేశామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మెట్ట ప్రాంతంగా ఉన్న చొప్పదండి నియోజకవర్గంలో జల యజ్ఞంలో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపూర్ జలాశయానికి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. 90 శాతం పనులు కూడా పూర్తి చేసిందని అన్నారు. మిగిలిన 10 శాతం పనులను గత సర్కారు పట్టించుకోలేదని అన్నారు. నారాయణపూర్ జలాశయం పనులన్నీ పూర్తి చేస్తామని, మిగిలిన ఆయకట్టుకు కూడా నిరందిస్తామని వివరించారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు గతంలో సమర్పించిన దరఖాస్తులన్నీ పరిగణలోకి తీసుకున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అర్హులుగా ఉన్న వారి పేరు గ్రామసభలో లేకపోతే అక్కడే దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. చాలా ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రేషన్ కార్డుల ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మి కిరణ్, ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ పాల్గొన్నారు.

# నిజమైన అర్హులను ఎంపిక చేసేందుకే మళ్ళీ గ్రామ సభలు

**- మొదటి జాబితాలో పేర్లు రాని వారు ఈ సభల్లో నమోదు చేసుకోవచ్చు**
**- తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**- నేలకొండపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన**

ఖమ్మం: నిజమైన అర్హులను ఎంపిక చేసేందుకే మళ్ళీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలం మోటపురం, కోరట్లగూడెం, కోనాయిగూడెం, పైనంపల్లి, అప్పలనర్సింహాపురం, కట్టుకాచారం, కొంగర, బుద్దరాం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి ప్రసంగించారు. గతంలో జరిగిన గ్రామ సభల్లో దరఖాస్తు ఇచ్చి ప్రస్తుతం ఈ నెల 26 నుంచి అమలు కాబోతున్న నాలుగు పథకాల జాబితాలో పేర్లు రాకపోతే ఎవరూ కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. వారి కోసమే మళ్లీ ఈ గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నాలుగు రోజులు పాటు విడతల వారీగా ఆయా గ్రామాల్లో జరిగే గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకునే వారిలో నిజమైన అర్హులు ఉంటే వారికి వెంటనే పథకాలను అందించడం జరుగుతుందన్నారు. రెచ్చగొట్టే మాటలను ఈ ప్రభుత్వం పట్టించుకోదని చిత్తశుద్ధితో పనిచేయడమే ఈ ప్రభుత్వానికి తెలుసన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. పాలేరు నియోజకవర్గంలోని



అన్ని మండల గ్రామాల్లో ఇప్పటికే దాదాపుగా అన్ని రకాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, మద్దినేని బేబి స్వర్ణ కుమారి, ఆర్డీవో నర్సింహారావు, స్పెషల్ ఆఫీసర్ రమేష్, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ పెరుగుతన్న చలి...

హైదరాబాద్: తెలంగాణలో చలిపులి పంజా విసురుతోంది. గత వారం క్రితం వరకు సాధారణంగానే ఉన్న ఉష్ణోగ్రతలు ఉన్నట్లుండి తగ్గిపోయాయి. రెండ్రోజులుగా చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. చాలా ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 దాటినా చలి తీవ్రత తగ్గటం లేదు. దానికి తోడు పొగమంచు కూడా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో స్వెట్టర్లు, మఫ్లర్లు లేకుండా కాలు బయటపెట్టం లేదు. కాగా, నేడు, రేపు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో చల్లటి ఈదురుగాలులు వీస్తాయన్నారు. 10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందన్నారు. ఈ మేరకు ఈ నాలుగు జిల్లాలకు అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసారు. ఇక హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, కరీంనగర్, మెదక్, మేడ్చల్, ములుగు, నిజామాబాద్, జనగామ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఇక రాత్రి తెలంగాణలోనే అతి తక్కువగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గిన్నెధరిలో 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. సిర్పూర్‌లో 6.3 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7 , రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 7.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు. మరో ఏడు జిల్లాల్లోని చాలా మండలాల్లో 10 డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు నమోదనట్లు తెలిపారు. తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణీలు, చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని.. చలి ఎక్కువగా సమయంలో ఇళ్లకే పరిమితం కావాలని, వెచ్చని దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు. ఇక పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

# గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

**-మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా**



మంథని: గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమా సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మంథని పట్టణం రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన వార్డు సభలో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమా సురేష్ రెడ్డి గురుకులాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న గురుకులాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఉమ్మడి గురుకులాల 5వ తరగతి ప్రవేశ పరీక్షకు అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోగలరని కోరారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎస్సీ ఎస్టీ బీసీ జనరల్ గురుకులాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుండి 9 తరగతిలో ఖాళీల కొరకు ప్రవేశానికి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గౌలిదొడ్డి, అలుగునూరు సిఓఈలో 9వ తరగతి ప్రవేశానికి, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈలో ఎనిమిదో తరగతి ప్రవేశానికి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్ స్కూల్ లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె వివరించారు. విద్యార్థులు ఫిబ్రవరి 01 లోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థి కులం సర్టిఫికెట్ నెంబర్, ఆదాయం సర్టిఫికెట్ నెంబర్, ఆధార్ కార్డు నెంబర్, బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, ఫోటో లతో ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోగలరని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23వ తేదీన ఉంటుందని గుర్తు చేశారు. గురుకులాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆమె తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంలో గురుకులాలపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని ఆమె వివరించారు. విద్యార్థులకు మెనూ చార్జీలు పెంచడం వల్ల పౌష్టికమైన ఆహారం అందుతున్నట్లు ఆమె తెలిపారు. అర్హత గల విద్యార్థులు గురుకులాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆమె ఆశించారు. ఈ కార్యక్రమంలో మంథని డిప్యూటీ తాసిల్దార్ గిరి, ఏడిఏ అంజని మిశ్రా, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్ వికే రవి, మంథని సాంఘిక సంక్షేమ గురుకుల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతు బంధులో రాబందులు

ఖమ్మం: రియల్ ఎస్టేట్ వెంచర్లు, కోళ్ల ఫారాలు, ఇటుక బట్టీలు, రాళ్ల గుట్టలు, మట్టిదిబ్బలు, మట్టి క్వారీలు, వడ్ల మిల్లులు, కోల్డ్ స్టోరేజీలు, బీడు భూములు.. కావేవి రైతుబంధుకు అనర్హం అని కొందరు ఘనాపాటీలు నిరూపించారు. చక్కగా ఏళ్లకు ఏళ్లు ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం పొందారు. 'రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేసి, వాటిని తీర్చలేక ఆగం కావొద్దు.. సాఫీగా సాగు చేసుకోవాలి..' అన్న సంకల్పంతో గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసిం ది. తద్వారా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసింది. కానీ.. రాజకీయ నేతల 'అండ దండలు', అధికారుల 'సహాయ సహకా రాల'తో కొందరు సాగులో లేని భూములకు పట్టాలు చేయించు కున్నారు. వారి ఖాతాల్లో సుమారు రూ.10 కోట్లకు పైగా జమ అయిం ది. 'రైతుభరో సా' అమలు కోసం ఖమ్మం జిల్లాలో ప్రభుత్వం చేపడు తున్న సర్వేలో వెలుగులోకి వస్తున్న ఇలాంటి వాస్తవాలు ఎన్నో.. రాష్ట్రప్రభుత్వం ఈనెల 26 నుంచి 'రైతుభరోసా' అమలు చేయనున్న నేపథ్యంలో వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికా రులు ఈ నెల16 నుంచి ఖమ్మం జిల్లావ్యాప్తంగా యోగ్యత ఉన్న భూముల గుర్తింపునకు సర్వే చేపడుతున్నారు. ఈ సర్వేలో రైతుబంధు అక్రమాలు కుప్ప లు తెప్పలుగా బయటపడుతున్నాయిఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా సాగుకు పనికి రాని సుమారు 15 వేల ఎకరాలకు పైగానే రైతుబంధు పథకం వర్తించినట్లు సర్వేలో తేలింది. జిల్లాకేంద్రం సమీపంలోని రఘునాథపాలెం, బల్లేపల్లి, వి.వెంకటాయపాలెం, ధంసలాపు రం, అల్లీపురం, కొదుమూరు, ప్రకాశ్‌నగర్, ఇల్లెందు రోడ్, శ్రీనివాసనగర్, ఖమ్మం రూరల్ ప్రాంతాల్లోనే సాగులో లేని 500 ఎకరాలకు పైగా ఈ పథకం వర్తించినట్లు సర్వేలో వెల్లడైంది. ఖమ్మం నగరానికి కూతవేటు దూరంలోని ధంసలాపురం ప్రాంతంలో సాగులో లేని సుమారు 250 ఎకరాలకు పథకం వర్తించినట్లు అధికా రులు సర్వేలో గుర్తించారు. ఖమ్మం నగరం రోజురోజుకూ తన పరిధులను విస్తరించుకుంటున్న క్రమంలో శివారు గ్రామాల్లోని భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో కొందరు వ్యవసాయ యోగ్యమైన వేలాది ఎకరాల భూములను కొందరు రియల్టర్ల కు విక్రయించారు. ఈ క్రమంలో ఆ భూములన్నీ సాగుకు పనికి రాని కన్వర్టెడ్ భూములుగా మారాయి. ఆ వెంచర్లకు కూడా రైతుబంధు పథకం వర్తించడాన్ని తాజాగా అధికారులు గుర్తించారు. ఖమ్మం రెవెన్యూ డివిజన్‌లోనే ఎక్కువగా రైతుబంధు పథకం దుర్వినియోగం అయిందని అధికారులు సర్వేలు గుర్తించారు. ఖమ్మం నగర శివారులోని 20 ఎకరాల వెంచర్, ఇటుక బట్టీలు, మట్టిదిబ్బలు, క్వారీలకు పథకం వర్తించింది. ఈ లిస్ట్‌లో కల్యాణ మండపాలు, కోల్డ్ స్టోరేజీలు, వడ్ల మిల్లులు కూడా ఉండడంతో సర్వే అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలా ఖమ్మం చుట్టుప క్కల ప్రాంతాల్లోనే సాగులో లేని సుమారు 500 ఎకరాల భూములకు పథకం వర్తించిందంటే.. ఇక జిల్లావ్యాప్తంగా ఎంత ప్రజాధనం అనర్హుల ఖాతాల్లో జమ అయిందో ఇట్టే అంచనా వేయొచ్చు. ఈ నేపథ్యంలో ప్రభు త్వం పక్కాగా సర్వే చేపట్టి, సాగులో ఉన్న భూమలకే రైతుభరోసా వర్తింపజేయాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతున్నది

# మళ్లీ పెరుగుతున్న గన్ కల్చర్

నల్గొండ: తెలంగాణలో గన్ కల్చర్ పెరుగుతోంది. ఇందుకు కారణాలు ఏమైనా.. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీసులకు మళ్లీ ఆయుధాలు ఇవ్వాలనే అంశంపై ఉన్నతాధికారులు ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నారని పోలీస్ శాఖలో చర్చలు జరుగుతున్నాయి. దాదాపు పదేళ్ల కిందట సూర్యాపేట బస్టాండులో సిమీ ఉగ్రవాదులు ఇద్దరు పోలీసులను కాల్చి చంపేశారు. అప్పుడే పోలీసులకు ఆయుధాలు ఇవ్వాలని భావించారు. కానీ అమలు కాలేదు. ఇటీవల హైదరాబాద్ నగరం అఫ్జల్‌గంజ్ ఘటనతో మళ్లీ అంశం తెరపైకి వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదం బలంగా ఉన్న సమయంలో.. ప్రభావిత ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు ఉండేవి. ఒకవేళ మావోయిస్టులు దాడి చేసినా.. సిబ్బంది ఆయుధాలతో ఎదుర్కొనేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ఎస్సై, ఆపై స్థాయి అధికారుల వద్ద ఆయుధాలు ఉండేవి. స్టేషన్లలోనూ ఆయుధాలను అందుబాటులో ఉంచేవారు. అయితే.. వామపక్ష తీవ్రవాదం కాస్త తగ్గిన తర్వాత ఈ విధానానికి తెరదించారు. కేవలం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఆపైస్థాయి అధికారులకు మాత్రమే పిస్తోలు వంటి ఆయుధాలను ఇచ్చారు. సాయుధ సెంట్రీ పోస్టులను కూడా తీసేశారు. కేవలం వాచ్ పేరుతో.. ఆయుధాలు లేని కానిస్టేబుళ్లే కాపలా విధులు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణలో మావోయిస్టుల పెద్దగా లేని ప్రాంతాలు, పట్టణాలు, నగరాల్లోని పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది అందరికీ ఆయుధాలు తొలగించారు. దీంతో ఎన్నో ఘటనలు జరిగాయి. కొందరు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. 2009, 2010 సంవత్సరాల్లో ఉగ్రవాది వికారుద్దీన్ జరిపిన కాల్పుల్లో.. ఆయుధాలు లేని కారణంగా ఇద్దరు పోలీసులు చనిపోయారు. మరో ఐదుగురు గాయపడ్డారు. 2014లో మరో ఘటన జరిగింది. నకిలీ నోట్ల కేసులో తనను పట్టుకోవడానికి వచ్చిన పోలీసులపై రౌడీషీటర్ ఎల్లం గౌడ్ కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఈశ్వరయ్య అనే కానిస్టేబుల్ చనిపోయారు. 2015 ఏప్రిల్ 2న సూర్యాపేట బస్టాండ్‌లో అస్లాం, ఎజాజుద్దీన్ అనే ఇద్దరు సిమీ ఉగ్రవాదులు.. కానిస్టేబుల్ మెట్టు లింగయ్య, హోంగార్డు కుమ్మరి మహేష్‌లను కాల్చి చంపారు. వారిని వెతుక్కుంటూ వెళ్లిన ఎస్సై సిద్దయ్య, కానిస్టేబుల్ నాగరాజులపై కాల్పులు జరిపి చంపేశారు. తాజాగా కర్ణాటకలోని బీదర్‌లో దోపిడీకి పాల్పడ్డ ఇద్దరు నిందితులు.. డబ్బు సంచులతో హైదరాబాద్ వచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వెళ్లేందుకు బస్సు ఎక్కడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో మరోసారి కాల్పులు జరిపారు. ఇటీవల నార్త్ ఇండియా నుంచి తెలంగాణలోకి విచ్చలవిడిగా గన్‌లు రవాణా అవుతున్నాయనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదం పొంచి ఉందనే హెచ్చరికలు ఉన్నాయి. ఈ పరిణామాలతో క్షేత్రస్థాయిలో పోలీసులకు కూడా ఆయుధాలు ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని పోలీస్ శాఖ చర్చ జరుగుతోంది.

# అధికారులందరూ క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి ప్రతి పథకానికి వర్తింపజేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత**

జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాల ఎంపిక కు అధికారులందరూ క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి ప్రతి పథకానికి వర్తింపజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రామ సభలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత జిల్లా లోని మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో తోపాట కోరుట్ల పట్టణంలోని 13 వ వార్డు మరియు 29 వ వార్డు జరుగుతున్న గ్రామ సభలో జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రైతు భరోసా కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. అలాగే అర్హులైన పేదవారికి ఏర్పాటు చేసిన గ్రామసభల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే గ్రామ సభలలో 4 పథకాలకు ద్వారా ఎంపిక చేయబడిన అర్హుల జాబితా గ్రామ సభలు అర్హుల పేర్లను ప్రవేశపెట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నాలుగు పథకాల ద్వారా అధికారులందరూ క్షేత్రస్థాయిలో సర్వే చేసి అర్హులను జాబితా ఈరోజు గ్రామసభలో ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. గ్రామసభ ఆమోదంతో అర్హత పొందిన వారికి ఈ పథకాలు వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకా లిస్టులో ఈ గ్రామంలో పేర్లు రాని వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని .కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు రైతు భరోసా ఆత్మీయ భరోసాలు పథకాలు గ్రామ సభలో ద్వారా ఏర్పాటు చేసిన కౌంటర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలియజేశారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి ప్రతి పథకానికి వర్తింపజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్, ఎమ్మార్వో కిషన్, ఎంపీడీవో పద్మావతి ,మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, సంబంధిత అధికారులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన అవసరం లేదు అందరికీ లబ్ధి చేకూరుతుంది

**ప్రజాపాలన గ్రామసభల్లో ఎమ్మెల్యే**

వనపర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయని ఎవరు కూడా ఆందోళన చెందకూడదని నిరంత రాయంగా జరిగే ఈ ప్రక్రియ ద్వారా ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల సందర్భంగా మంగళవారం వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి ఘణపురం మండలం ఉప్పర్ పల్లి, పెద్దమందడి మండల చీకరుచెట్టు తండా, ముందరి తండాలలో నిర్వహించిన గ్రామసభల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, స్థానిక సంస్థల కలెక్టర్ సంచిత్ గాంగ్వర్, లతో కలిసి గ్రామసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 26వ తేదీ నుంచి అమలయ్యే రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు అర్హత గల లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం చేపట్టిన ఈ గ్రామసభలలో అర్హత గల వారిని గుర్తించాలని, ఎవరైనా దరఖాస్తు చేసుకోనివారు ఉంటే దరఖాస్తు చేసుకో వచ్చని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాలలో నిర్వహించే సమావే శాల్లో పాల్గొని అర్హత గల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలు భాగస్వా ములు కావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ , ఆయా మండలాల, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తాసిల్దార్లు వ్యవసాయ అధికారులు ప్రత్యేక ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి నిరుపేదలకు ప్రతి పథకాన్ని అందజేస్తుంది

**జిల్లా కలెక్టర్ బి,సత్య ప్రసాద్**

జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి నిరుపేదలకు ప్రతి పథకాన్ని అందజేస్తుందని అధికారులందరూ క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి ప్రతి పథకానికి వర్తింపజేయాలని జిల్లా కలెక్టర్ బి,సత్య ప్రసాద్ ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలంలో నర్సింగాపూర్ గ్రామంలో జరుగుతున్న గ్రామ సభలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ, ఆత్మీయ, భరోసా,రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. అలాగే అర్హులైన పేదవారికి ఏర్పాటు చేసిన గ్రామసభల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

అలాగే గ్రామ సభలలో 4 పథకాలకు ద్వారా ఎంపిక చేయబడిన అర్హుల జాబితా గ్రామ సభలు అర్హుల పేర్లను ప్రవేశ పెట్టారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నాలుగు పథకాల ద్వారా అధికారులందరూ క్షేత్రస్థాయిలో సర్వే చేసి అర్హులను జాబితా ఈరోజు గ్రామసభలో ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. గ్రామసభ ఆమోదంతో అర్హత పొందిన వారికి ఈ పథకాలు వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు.

ఇంకా లిస్టులో ఈ గ్రామంలో పేర్లు రాని వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని . కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు రైతు భరోసా ఆత్మీయ భరోసాలు పథకాలు గ్రామసభలు ద్వారా ఏర్పాటు చేసిన కౌంటర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలియజేశారు. జనవరి 26 తారీకు నుండి ఈ పథకాలు ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి నిరుపేదలకు ప్రతి పథకాన్ని అందజేస్తుందని అధికారులందరూ క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి ప్రతి పథకానికి వర్తింపజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో , సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులి సంచారం

అదిలాబాద్: కొన్ని రోజులుగా ప్రశాంతంగా ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులి సంచారం మరోసారి కలకలం రేపుతోంది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని తాంసి, గొల్లఘాట్ శివారులో పులి సంచరిస్తోంది. పెన్ గంగానది ఒడ్డున ఉన్న మహారాష్ట్ర లోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన పెద్దపులి గొల్లఘాట్, తాంసి (కె), ప్రాంతాల్లో తిరుగుతోంది. తాంసి (కె) గ్రామ సమీపంలోనీ పిప్పల్ కోటి రిజర్వాయర్ పని ప్రదేశంలో సోమవారం రాత్రి సమయంలో లారీ డ్రైవర్లకు పెద్దపులి కనిపపించింది. దీంతో గమనించిన డ్రైవర్లు పెద్దపులి వీడియోను రికార్డ్ చేశారు. ఆపై వారి నుండి ఆ విడియో వైరల్ అవుతూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పులి సంచారం గురించి సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు తాంసి, ఆర్లి (టీ) సెక్షన్ అధికారి మోపత్ రావ్, బీట్ ఆఫీసర్లు సాయి, శ్రీనివాస్, రామేశ్వర్, అనిమల్ ట్రాకర్ లు సోనేరావు, కృష్ణలు మంగళవారం నాడు పులి సంచరించిన ప్రాంతంలో పులి పాద ముద్రలను గాలించగా.. ఎలాంటి పాదముద్రలు తమకు లభ్యం కాలేదని తెలిపారు. ఇద్దర్ సెక్షన్ల అధికారులు, రెండు టీంలు గా బేస్ క్యాంపు ఏర్పాటు చేసి పులి జాడ కోసం తిరుగుతున్నారు. పులి సంచరించే ప్రాంతాల్లో 8 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పులి సంచారం నేపథ్యంలో ఆ ప్రాంత వాసులు జగ్రత్తగా ఉండాలని స్థానికును అప్రమత్తం చేశారు. ఎవరికైనా పులి కనిపించినా, పులి గురించి ఏమైనా సమాచారం తెలిపిన అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# మార్క్రమ్ మామ విధ్వంసం.. సన్‌రైజర్స్ ఘన విజయం!



సౌతాఫ్రికా20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జైత్రయాత్ర కొనసాగుతోంది. హ్యాట్రిక్ పరాజయాలతో ఈ టోర్నీ ప్రారంభించిన డిఫెండింగ్ ఛాంపియన్ సన్‌రైజర్స్..

వరుసగా మూడు విజయాలు సాధించింది. ప్రిటోరియా క్యాపిటల్స్‌తో బుధవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ 52 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్(55 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సన్‌రైజర్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 149 పరుగులు చేసింది. మార్క్రమ్ హాఫ్ సెంచరీతో రాణించగా.. మార్కో జాన్సెన్(19 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 24), లియమ్ డాసన్(11 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 25) మెరుపులు మెరిపించారు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన ప్రిటోరియా క్యాపిటల్స్.. మార్కో జాన్సెన్(4/13), లియమ్ డాసన్(3/17) ధాటికి 16.3 ఓవర్లలో 97 పరుగులకే కుప్పకూలింది. కీగన్(28), మార్ర్యూస్(25) టాప్ స్కోరర్లుగా నిలిచారు. సన్‌రైజర్స్ బౌలర్లలో జాన్సెన్, డాసన్‌లకు తోడుగా రిచర్డ్ గ్లీసన్, ఓట్నీల్ బార్ట్‌మన్ తలో వికెట్ పడగొట్టారు.

ఇప్పటి వరకు 6 మ్యాచ్‌లు ఆడిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ తొలి మూడు మ్యాచ్‌లు ఓడి.. తర్వాతి మూడు మ్యాచ్‌ల్లో గెలిచింది. దాంతో పాయింట్స్ టేబుల్‌లో మూడో స్థానానికి చేరింది.

సౌతాఫ్రికా 20 లీగ్‌లో ఐపీఎల్ ఫ్రాంచైజీలు భాగమైన విషయం తెలిసిందే. ఈ టోర్నీలో మొత్తం 6 జట్లు తలపడుతుండగా.. ఈ ఆరు టీమ్స్ ఐపీఎల్ ఫ్రాంచైజీలకు చెందినవే. సన్‌రైజర్స్, ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్‌తో పాటు రాజస్థాన్ రాయల్స్‌కు సంబంధించిన జట్లు ఉన్నాయి.

ఈ క్రమంలోనే సౌతాఫ్రికా 20 లీగ్‌ను మినీ ఐపీఎల్‌లా పరిగణిస్తారు. ఇక ప్రతీ మ్యాచ్‌కు హాజరయ్యే కావ్య మారన్.. ఈ సారి మాత్రం ఇంకా సౌతాఫ్రికా 20 లీగ్‌లో కనిపించలేదు. కావ్య లేకపోవడంతోనే విజయాలు దక్కడం లేదని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.

# తెలుగమ్మాయి త్రిష ధనాధన్.. భారత్ హ్యాట్రిక్ విక్టరీ

అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్‌లో భారత జట్టు తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఇప్పటికే వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచిన మన అమ్మాయిలు.. తాజాగా జరిగిన మ్యాచ్‌లోనూ విజయం సాధించారు. శ్రీలంకను 60 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించారు. దీంతో భారత జట్టు టోర్నీలో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసినట్లైంది. ఈ విజయంతో సూపర్ -6లో ఎంట్రీ ఇచ్చింది.

ఒక్క పరుగు తేడాతో జస్ట్ మిస్

ఈ మ్యాచ్ లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగింది టీమిండియా. 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 118 పరుగులు సాధించింది. తెలుగమ్మాయి ఓపెనర్ గొంగడి త్రిష త్రుటిలో హాఫ్ సెంచరీని చేజార్చుకుంది. 44 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో 49 పరుగులు చేసింది. ఈమె మినహా ఇంకెవ్వరూ పెద్దగా రాణించలేదు. మిథిలా వినోద్ (16), జోషిత (14), కెప్టెన్ నిక్కి ప్రసాద్ (11), నామమాత్రపు పరుగులు చేశారు. భవికా (7), ఆయుషి (5), కమలిని (5) నిరాశ పరిచారు. లంక బౌలర్లలో ఏసేని తలగునె, ప్రముది, లిమాన్స తిలకరత్న తలో రెండు వికెట్లు తీశారు. చామోడి ప్రభోద, రష్మిక, మనుడి నానయక్కర ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.



ఆ తర్వాత లక్ష్యఛేదనలో శ్రీలంక.. భారత బౌలర్ల దెబ్బకు కుప్పకూలిపోయింది. 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 58 పరుగులే చేసింది. లంక జట్టులో టాప్-5 ఉన్న బ్యాటర్లలో ఏ ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. పరుగులు చేయడానికి బాగా ఇబ్బంది పడ్డారు. ఫైనల్ గా ఆరో స్థానంలో బ్యాటింగ్ కు దిగిన రష్మిక సెవ్వండి మాత్రం 15 చేసింది. లంక జట్టులో ఈ ఇన్నింగ్స్ లో ఇదే టాప్ స్కోర్. టీమిండియా బౌలర్లలో షబ్నమ్ , జోషిత , పరుణికా సిసోధియా తలో రెండు తీశారు. వైష్ణవి శర్మ, ఆయుషి శుక్లా తలో ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

# బీసీసీఐకి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన ఐసీసీ!

ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి భారత – పాకిస్థాన్ క్రికెట్ బోర్డుల మధ్య తాజాగా రాజుకున్న మరో వివాదం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. టీమిండియా ప్లేయర్స్ జెర్సీల మీద ఆతిథ్య దేశం పేరు ముద్ర వేసే విషయమై బీసీసీఐ–పీసీబీ మధ్య వివాదం చెలరేగింది.

అయితే ఐసీసీ రూల్స్ ప్రకారం ఆటగాళ్ల జెర్సీ పై ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఆతిథ్య దేశం పేరు కచ్చితంగా ఉండాలని తెలుస్తోంది. కానీ పాక్ పేరును ముద్రించడానికి, బీసీసీఐ అభ్యంతరం వ్యక్తం చేస్తోందట. ఈ క్రమంలోనే తాజాగా.. వివాదస్పదమైన ఈ అంశంలోకి ఐసీసీ జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. బీసీసీఐకి ఓ స్ట్రాంగ్ మెసేజ్ పంపించినట్లు ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

"జెర్సీపై టోర్నమెంట్ లోగో ముద్ర వేయడం ప్రతీ జట్టు యొక్క బాధ్యత. ప్రతి జట్టు ఈ నిబంధనను పాటించాలి. కాబట్టి టీమిండియా జెర్సీపై, ప్లేయర్స్ కిట్ పై ఆతిథ్య దేశం పేరుతో ఛాంపియన్స్ ట్రోఫీ లోగో ఉండాలి. ఒకవేళ టీమిండియా దీనిని పాటించకపోతే స్ట్రిక్ట్ యాక్షన్ తీసుకుంటాం." అని ఓ ఐసీసీ అధికారి చెప్పినట్లు ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇక ఈ జెర్సీ వివాదంపై ఓ బీసీసీఐ అధికారి కూడా స్పందించారు. ఇదేం పెద్ద విషయం కాదని, రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. భారత్ తన మ్యాచ్ లను దుబాయ్ లో ఆడుతోందని, కాబట్టి జెర్సీపై పాకిస్థాన్ పేరు ఉండాల్సిన అవసరం లేదని వెల్లడించారు. "జెర్సీపై పేరు కచ్చితంగా ఉండాల్సిన అవసరం లేదు. అయినా మేం దుబాయ్ లో ఆడుతున్నాం. పాకిస్థాన్ లో ఆడట్లేదు. కాబట్టి జెర్సీపై వాళ్ల పేరు ఉండాలనేం లేదు. ఛాంపియన్స్ ట్రోఫీ టూర్ సందర్భంగా ఇతర దేశాల్లో పోడియంపై పాకిస్థాన్ పేరును ప్రదర్శించారు. కానీ ఇండియాలో మాత్రం అలా చేయలేదు. పోడియంపై పాకిస్థాన్ పేరును ప్రదర్శించలేదు. కాబట్టి ఐసీసీ రూల్స్ ప్రకారం టీమిండియా జెర్సీపై కేవలం ఛాంపియన్స్ ట్రోఫీ లోగోను మాత్రమే ముద్రిస్తాం." అని చెప్పారు.అంతకుముందు పీసీబీ మాట్లాడుతూ..

"బీసీసీఐ క్రికెట్లోకి రాజకీయాలను తెస్తోంది. దీని వల్ల ఆటకు నష్టం కలుగుతుంది. మొదటగా భారత జట్టును పాకిస్థాన్‌కు పంపడానికి తిరస్కరించారు. ట్రోఫీ ప్రారంభ వేడుకలకు కెప్టెన్‌ను పంపించట్లేదు. ఇప్పుడేమో టీమిండియా జెర్సీలపై ఆతిథ్య దేశం (పాకిస్థాన్) పేరును ముద్రించట్లేదు" అని విమర్శించింది.

# సచిన్, గవాస్కర్ దిగ్గజాలే.. కానీ ఇది కోహ్లీ జమానా: సీఎం రేవంత్ రెడ్డి

భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్, విరాట్ కోహ్లీలను ప్రస్తావిస్తూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణకు ఏ మాత్రం పోటీ లేదనే విషయాన్ని చెబుతూ క్రికెటర్ల పేర్లను ప్రస్తావించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. సమయస్ఫూర్తితో రేవంత్ రెడ్డి చెప్పిన సమాధానానికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.

అసలు విషయం ఏంటంటే..?

ప్రస్తుతం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొని రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన పలు జాతీయ ఛానెల్స్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఓ ప్రముఖ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పక్కరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ గురించి జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు రేవంత్ రెడ్డి తనదైన శైలిలో బదులిచ్చారు. 'మీకు టీడీపీ పార్టీ, ఆ రాష్ట్రం గురించి, ముఖ్యంగా చంద్రబాబు నాయుడి గురించి బాగా తెలుసు. పక్కరాష్ట్రమైన ఆంధ్రతో మీకు పోటీ ఉందని భావిస్తున్నారా?'అని సదరు జర్నలిస్ట్ రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. వెంటనే రేవంత్ రెడ్డి.. 'మాకు ఎలాంటి పోటీ లేదు. సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్‌లు ఇద్దరూ క్రికెట్ దిగ్గజాలు. కానీ ఇది విరాట్



కోహ్లీ యుగం. కాలం మారింది. ఎలా ఆడాలో కోహ్లీ చూపిస్తాడు.'అని బదులిచ్చారు. ఇందుకు సంబంధించిన 21 సెకండ్ల వీడియో క్లిప్ నెట్టింట వైరల్‌గా మారింది. చంద్రబాబు నాయుడు దిగ్గజమని, తాను కోహ్లీలాంటి ఈ తరం పొలిటీషన్ అని రేవంత్ రెడ్డి చెప్పకనే చెప్పారు.అయితే ఈ వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రేవంత్ రెడ్డి అద్భుతమైన సమాధానమిచ్చారని కొందరంటే.. కోహ్లీ ఫామ్ గురించి తెలియకుండా మాట్లాడుతున్నారని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. దేశంలో కాంగ్రెస్ పరిస్థితి కోహ్లీ ఫామ్‌లానే ఉందని సెటైర్లు పేల్చుతున్నారు. ఇంకొందరు మాత్రం రేవంత్ రెడ్డి కూడా కోహ్లీకి డైహార్డ్ ఫ్యాన్ కావచ్చని కామెంట్ చేస్తున్నారు.

# జడేజా దెబ్బ.. పంత్ అబ్బా!

రంజీ ట్రోఫీ సెకెండ్ లెగ్ మ్యాచ్‌లు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఫామ్ అందిపుచ్చుకోవడం కోసం రంజీల్లో కచ్చితంగా ఆడాలని బీసీసీఐ కండీషన్ పెట్టిన నేపథ్యంలో టీమిండియా స్టార్ ప్లేయర్లంతా బరిలోకి దిగారు.

అయితే తొలి రోజే అంతా తుస్సుమనిపించారు. దీంతో అభిమానులంతా నిరాశ చెందారు. ఈ క్రమంలోనే ఒకే ఒక్కడు మాత్రం అద్భుత ప్రదర్శన చేసి క్రికెట్ అభిమానుల్లో కాస్త జోష్ నింపాడు.

ముంబయి తరపు బరిలోకి దిగిన రోహిత్ శర్మ, యశస్వి జైశ్వాల్, శ్రేయస్ అయ్యర్.. పంజాబ్ ప్లేయర్ శుభ్‌మన్ గిల్.. ఢిల్లీ ఆటగాడు రిషభ్ పంత్.. అంతా విఫలమైనా.... సౌరాష్ట్ర తరపు బరిలోకి దిగిన రవీంద్ర జడేజా మాత్రం మంచిగా రాణించాడు. ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు.

పంత్ సైలెంట్.. ఫుల్ జోష్ లో జడేజా

ఢిల్లీ, సౌరాష్ట్ర జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ కు దిగిన ఢిల్లీ 188 పరుగులకే ఆలౌట్ అయిపోయింది. ఆయుశ్ బదోని (60), యశ్ ధుల్ (44), మయాంక్ గుసెయిన్ (38 నాటౌట్) పర్వాలేదనిపించారు. అయితే ఢిల్లీ తరఫున బరిలోకి దిగిన



పంత్ దారుణమైన ప్రదర్శన చేశాడు. 10 బంతులు ఎదుర్కొని ఒక్క పరుగు మాత్రమే చేసి ఔట్ అయ్యాడు. ఇక ఢిల్లీ బ్యాటింగ్ లైనప్‌ను స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఓ ఆటాడుకున్నాడు. 17.4 ఓవర్లలో 66 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. 36 ఏళ్ల జడ్డూకు ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో ఇది 35వ ఐదు వికెట్ల ఘనత. జడేజాకు ధర్మేంద్రసిన్హ్ తోడై మరో 3 వికెట్లు తీశాడు. 19 ఓవర్లలో 63 పరుగులిచ్చి ఈ వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా పంత్ జట్టును జడేజా షేక్ ఆడించాడు.

# కేకేఆర్ కు భారీ షాక్.. రూ.23.75 కోట్ల ప్లేయర్ కు గాయం

ఐపీఎల్-2025కు ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు భారీ షాక్. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ గాయపడ్డాడు. ప్రస్తుతం జరుగుతోన్న రంజీ ట్రోఫీ మ్యాచ్ లో అతడికి దెబ్బ తాకింది.ప్రస్తుత రంజీ ట్రోఫీ సీజన్ లో భాగంగా గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం వేదికగా మధ్యప్రదేశ్ జట్టు..

కేరళ జట్టుతో తలపడింది. ఈ మ్యాచ్ లో మధ్యప్రదేశ్ కు ప్రాతినిధ్యం వహిస్తోన్న వెంకటేశ్ అయ్యర్.. జట్టు స్కోర్ 50/4 ఉన్న సమయంలో బ్యాటింగ్ కు వచ్చాడు. జట్టును మంచి స్కోరు అందించాలనే ఉద్దేశంతో బ్యాటింగ్ చేస్తుండగా.. అతడి కుడి కాలి చీలమండకు గాయమైంది. మూడు బంతులు ఎదుర్కోగానే అతడి గాయం తగిలింది. దీంతో అతడు నొప్పితో విల్లవిల్లాడుతూ కిందపడిపోయాడు. వెంటనే ఫిజియో వచ్చి చికిత్స అందించారు. కానీ నొప్పి మాత్రం తగ్గలేదు. ఇక చేసేదేమిలేక అతడు మైదాన్ని వీడాల్సి వచ్చింది.


ఈ గాయం వల్ల అయ్యర్ మిగిలిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లకు దూరమయ్యే ఛాన్స్ ఉంది. అయితే వెంకటేశ్ కు అయిన గాయం కేకేఆర్ ఫ్యాన్స్ ను ఆందోళనకు గురిచేస్తుంది. ఎందుకంటే ఐపీఎల్ దగ్గర పడుతోంది. పైగా గత సీజన్‌లో కేకేఆర్ ఛాంపియన్‌గా నిలవడంలో అతడే కీలకంగా వ్యవహరించాడు. దీంతో మెగా వేలంలో రూ.23.75 కోట్లు భారీ ధర వెచ్చించి మరీ వెంకటేశ్‌ను కేకేఆర్ కొనుగోలు చేసింది కేకేఆర్. అందుకే అతడికి గాయం త్వరగా తగ్గిపోవాలని ఆశిస్తున్నారు.

# పీవీ సింధుకు మళ్లీ షాక్

భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు మరో షాక్ తగిలింది. ఈ ఏడాది బరిలోకి దిగిన రెండో టోర్నీలోనూ ఆమెకు నిరాశే ఎదురైంది. ఇండియా ఓపెన్-750 టోర్నీ క్వార్టర్ ఫైనల్లో ఇంటి ముఖం పట్టిన సింధుకు.. ఇప్పుడు ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నీలోనూ చుక్కెదురైంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లోనే ఇంటి ముఖం పట్టింది. తాజాగా జరిగిన ఈ మ్యాచ్‌లో 12వ ర్యాంకర్ అయిన పీవీ సింధు 20-22, 12-21 తేడాతో 32వ ర్యాంకర్ తిన్ నుయెన్ (వియత్నాం)పై ఓడిపోయింది. దీంతో గతంలో రెండు సార్లు సింధుతో పోటీ పడి (2022 సింగపూర్ ఓపెన్, 2023 ఆర్కిటిక్ ఓపెన్) ఓడిపోయిన తిన్ నుయెన్.. మూడో ప్రయత్నంలో ఎట్టకేలకు గెలిచింది. 37 నిమిషాల పాటు ఈ పోరు సాగింది.

లక్ష్యసేన్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ఎంటర్ అయ్యాడు. అతడు ఆడిన తొలి రౌండ్ ఏకపక్షంగా సాగింది. ఈ మ్యాచ్ లో లక్ష్య సేన్ వరుస గేమ్‌ల్లో 21-9, 21-14 తేడాతో తకుమ ఒబాయిషి (జపాన్)ను ఓడించాడు. ఆయుష్ శెట్టి 19-21, 19-21 తేడాతో షై యుకి (చైనా)పై, కిరణ్ జార్జ్ 12-21, 10-21తేడాతో జిన్ జియోన్ (కొరియా)పై ఓడిపోయారు.

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీ ప్రిక్వార్టర్



ఫైనల్ కు అర్హత సాధించింది. తొలి రౌండ్ లో ధ్రువ్- తనీషా ద్వయం 21-18, 21-14 తేడాతో అద్నాన్ మౌలానా- ఇందా కాహ్యా (ఇండోనేసియా) జోడీకి పరాజయం రుచి చూపించింది. రోహన్ కపూర్- రుత్విక శివాని ద్వయం 9-21, 13-21 తేడాతో గ్రెగొరీ మేర్స్ - జెనీ మేర్స్ ద్వయం చేతిలో ఓడిపోయింది.

# అభిషేక్ శర్మ ఊచకోత.. యూవీ సాధించిన మూడు భారీ రికార్డ్స్ గోవిందా!

ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఇంగ్లాండ్ తో జరిగిన తొలి టీ20లో విజృంభించిన టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (79: 34 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) అరుదైన ఘనత సాధించాడు.

మ్యాచ్ లో కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను టచ్ చేసిన పంజాబీ బ్యాటర్ అభిషేక్ శర్మ.. తన పేరిట పలు సూపర్ రికార్డులను నమోదు చేశాడు. తన మెంటార్ యువరాజ్ సింగ్ రికార్డులను కూడా బ్రేక్ చేశాడు.టీ20 మ్యాచ్ లక్ష్య ఛేదనలో అత్యంత వేగంగా(70o రన్స్) పరుగులు చేసిన టీమిండియా ప్లేయర్ గా అభిషేక్ నిలిచాడు. గతంలో (2013) యువరాజ్ సింగ్ 35 బంతుల్లో 77 పరుగులు (220 స్ట్రైక్ రేట్) చేశాడు. ఇప్పుడు అభిషేక్ 34 బంతుల్లోనే 79 (232.35 స్ట్రైక్ రేట్) రన్స్ సాధించాడు. దీంతో యూవీ రికార్డ్ బ్రేక్ అయింది.ఇంగ్లాండ్ పై ఓ టీ20 ఇన్నింగ్స్ లో అత్యధిక సిక్సర్లు బాదిన భారత్ బ్యాటర్ గా నిలిచాడు. గతంలో 2007 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ పై యువీ 7 సిక్సర్లు కొట్టాడు. ఇప్పుడు అభిషేక్ తన మెంటార్ యువరాజ్ ఆల్‌టైమ్ రికార్డును అధిగమించాడు.టీ20ల్లో ఇంగ్లాండ్ పై టీమిండియా తరపున రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా రికార్డుకెక్కాడు అభిషేక్ శర్. ఈ క్రమంలోనే కేఎల్ రాహుల్ రికార్డును అధిగమించాడు. 2018లో మాంచెస్టర్ వేదికగా జరిగిన టీ20లో ఇంగ్లాండ్ పై రాహుల్



27 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. ఇప్పుడు అభిషేక్ కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను టచ్ చేశాడు. ఈ అరుదైన రికార్డు జాబితాలో యువరాజ్ సింగ్ టాప్ లో కొనసాగుతున్నాడు. 2007 టీ20 వరల్డ్ కప్ లో యువరాజ్ సింగ్ కేవలం 12 బంతుల్లోనే అర్ధ శతకం బాదాడు.టీ20 మ్యాచ్‌లో భారత గడ్డపై అత్యంత వేగవంతమైన ఇన్నింగ్స్ (70o పరుగులు) ఆడిన ప్లేయర్‌గా ఘనత సాధించాడు అభిషేక్ శర్మ. గతంలో (2022లో) సౌతాఫ్రికా స్టార్ ప్లేయర్ డేవిడ్ మిల్లర్.. గౌహతి వేదికగా టీమిండియాతో జరిగిన మ్యాచ్‌లో 225.53 స్ట్రైక్ రేట్‌తో 106 పరుగులు చేశాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**